## ఘనంగా సీతారామచంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం

**నర్సాపూర్, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని లింగాపూర్ గ్రామ శివారులోని లాలుతండాలో వెలిసిన శ్రీసీతారామస్వామి ఆలయంలో గురువారం ఆలయ నిర్వాహకులు రాంచందర్ అధ్వర్యంలో పూజారి హరప్రతసాద్‌శర్మ వేద మంత్రాలతో ఆలయ మొదటి వార్షికోత్సవ ఉత్సవాలు ఘనంగా జరిగాయి ఈ సందర్భంగా పలువురు నాయకులు శ్రీ సీతారామస్వామి ఆలయానికి విచ్చేసి శ్రీ సీతారాచంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేయడం జరిగింది. ఈ మేరకు నర్సాపూర్ బిజెపి అసెంబ్లీ కన్వీనర్ వాల్దాస్ రాధా మల్లేస్‌గౌడ్ ఈ ఆలయంలోని శ్రీ సీతారామచంద్రుస్వామికి ప్రత్యేక పూజలు చేశారు అనంతరం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీయాదవ్ సైతం ఈ ఆలయానికి వచ్చి శ్రీ సీతారామంచంద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేయడం జరిగింది. ఈసందర్భంగా ఆలయ నిర్వాహకులు రాంచందర్ వారిని ఘన స్వాగతం పలికి సత్కరించారు, ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మండల ప్రనదాన కార్యదిర్శి నాగేశ్‌గౌడ్, శ్రీకాంతాచారి, ఉదయ్‌గౌడ్, బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.




మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త


## పల్స్ పోలియో విజయవంతం చేయాలి

**కొల్చారం, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త:**
మార్చి మూడో తేదిన నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కొల్చారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రమేష్ నాయక్ అన్నారు. గురువారం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండల కేంద్రమైన కొల్చారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని వైద్యాధికారి రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ మంజూల కాశీనాథ్, తాసీల్దార్ గఫర్ మీయా, ఇంచార్జి ఎంపీడీవో లక్ష్మి నర్సింలు, రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హార్షిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మిలు హాజరయ్యారు. మార్చి 3వ నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రతి గ్రామంలో గ్రామ పంచాయతీల వద్ద పోలియో చుక్కలు ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు అందరికి వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నంకు వినతి పత్రం అందిస్తున్న టిఎన్జీవోస్ నేతలు

## సిద్దిపేట జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలి

### మంత్రి పొన్నంకు టిఎన్జీవోల వినతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
సిద్దిపేటజిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని కోరుతూ హైదరాబాద్ లోని సచివాలయంలో గురువారం జిల్లా టిఎన్జీవోస్ అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కొమాండ్ల విక్రమ్‌రెడ్డిలు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కలిసి వినతి పత్రం అంద జేసి మాట్లాడారు. వినతి తీసుకున్న మంత్రి సానుకూలంగా స్పందించారని అన్ని విషయాలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని ఈ విషయాన్ని సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని తెలిపినట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లా ఉమ్మడి మెదక్ జిల్లాలో సంగారెడ్డి జిల్లా చార్మినార్ జోన్‌లో మెదక్, సిద్దిపేట రాజన్న సిరిసిల్ల జోన్‌లో కలపడం వల్ల ఉద్యోగులు ప్రమోషనల్లో, తదితర విషయాలలో నష్టపోతున్నారని తెలిపారు. 317 జీవో ఉప సంఘం సభ్యులైన మంత్రికి వినతి పత్రం అంద జేసినట్లు తెలిపారు. ఈ విషయమై మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. హైదారాబాద్‌కు అతిసమీపంలో ఉన్న సిద్దిపేట జిల్లాను రాజన్న సిరిసిల్ల జోన్‌లో కలపడం ఏరకంగా సహేతుకం కాదని అలాగే మల్టిజోన్‌ల్లో అదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు ఉద్యోగులు వెళ్లాల్సి రావడం జరిగిందని చార్మినార్ జోన్‌లో కలపడం ద్వారా ఉద్యోగులకు నిరుద్యోగులకు ఎంతో ఉపయోగం కలుగుతుందన్నారు. తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రధాని పర్యటనకు స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్



ప్రధాన మంత్రి పర్యటనకు స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పి

**కంది, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణానికి సమీపంలో మండల కేంద్రమైన కందిలోని ఐఐటిలో మార్చి 5న నిర్వహించనున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పర్యటనను పురస్కరించుకుని గురువారం సభ స్థలాన్ని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పి సిహెచ్ చెన్నూరి రూపేష్ పరిశీలించారు. ప్రధాన మంత్రి సభకు ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా, వాహనాల పార్కింగ్‌కు సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్, ఎస్పిలు సమాలోచనలు చేశారు.

## గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌లో వేలం



మున్సిపల్ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్న దృశ్యం

**గజ్వేల్, ఫిబ్రవరి 29 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గోల్కొండ నర్సయ్య ఆధ్వర్యంలో గురువారం తైబజార్, పశువుల సంతకు సంబంధించి వేలం నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ ఈ వేలంపాట నిర్వహించగా తైబజార్ వేలంలో 20 మంది పాల్గొనగా గంగిశెట్టి రవి రూ.21.54 లక్షల వేలం పాడి దక్కించుకున్నారు. అలాగే పశువుల సంత వేలంలో 23 మంది పాల్గొనగా టి.రాజేశం రూ.15.30 లక్షలు వేలం పాడి దక్కించుకున్నారని మున్సిపల్ కమిషనర్ నర్సయ్య పేర్కొన్నారు. ఈ రెండు వేలంలద్వారా రూ.36.84 లక్షల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పుకార్లు నమ్మవద్దు-అమాయకులను కొట్టొద్దు

### -ప్రజలకు సూచించిన జిల్లా ఎస్‌పి

**సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త:** చిన్న పిల్లలను కిడ్నాప్ చేస్తున్నారనే అనుమానాలతో అమాయక ప్రజలపై దాడులు చేయడం సరికాదని జిల్లా ఎస్పి సిహెచ్ రూపేష్ చెన్నూరి హెచ్చరించారు. గురువారం విలేఖరులకు ఎస్పి విడుదల చేసిన ప్రకటన ప్రకారం... చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవద్దని, అనుమానం వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను ఫార్వర్డ్ మెసేజ్‌ల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. మార్చి 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంగారెడ్డి డిఎస్‌ప సత్యయ్య గౌడ్, కొండాపూర్ సిఐ చంద్రయ్య, ఎస్‌ఐ హరి శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆస్తిపన్ను బకాయిలపై వన్‌టైమ్ సెటిల్మెంట్

### రామాయంపేట మున్సిపల్ కమిషనర్ దేవేందర్

**రామాయంపేట మున్సిపాలిటీ, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త :**
రామాయంపేట మున్సిపాలిటీలో ఆస్తిపన్ను బకాయిలపై వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేసుకునేందుకు ప్రభుత్వం ప్రజలకు అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ ఎమ్. దేవేందర్ తెలిపారు. గురువారం నాడు ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జివో నం 101 తేది 27.02.2024 జీవో ప్రకారం ఆస్తి పన్ను 2022-23 వరకు బకాయిలు పన్ను వడ్డీపైనా వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద 90 శాతం మాఫీ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేయబడిందన్నారు. కావున మున్సిపల్ పట్టణ ప్రజలు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్, బిల్ కలెక్టర్ శ్రీధర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

# బిజెపికి హటావో...దేశ్‌కి బచావో...!

**బిఆర్ఎస్ మేడిగడ్డ సందర్శన రాజకీయ డ్రామా**
**బండి సంజయ్ పొన్నంకు క్షమాపణ చెప్పాలి**
**సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి**



మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

**హుస్నాబాద్, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త**
బిజెపికి హటావో.. దేశ్‌కి బచావో నినాదంతో ఇండియా కూటమితో ముందుకు వెళ్తున్నామని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని అణభేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం బ్రతకాలంటే బిజెపి ఇంటికి వెళ్లాలన్నారు. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాష్ట్ర రాజకీయాలలో వేడి పుట్టిందని, బిజెపి రాముని పేరుతో ప్రచారం మొదలు పెట్టిందన్నారు. రాముడు మంచివాడేనని ఆయన్ను రాజకీయాలలోకి తెచ్చి మతవిధ్వంసాలు సృష్టించి మరోసారి అధికారంలోకి రావాలని మోడీ ప్రభుత్వం చూస్తుందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రైతులపై నల్ల చట్టాలు తీసుకువచ్చిందని చెప్పారు. నల్ల చట్టాలను రద్దు చేయాలని రైతులు సంవత్సరం నిరసన తెలిపితే పంటలకు మద్దతు ధర ఇస్తామని మోసం చేసిందని తెలిపారు. రైతులు ఇచ్చిన హామీని అమలు చేయాలని మళ్లీ శాంతియుతంగా ధర్నాలు చేస్తుంటే వారిపై కాల్పులు జరపడాన్ని తీవ్రంగా ఖండించారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంతో పాటు నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇక రాముని పుట్టుక గురించి సుప్రీంకోర్టే ఏం తీర్పు ఇవ్వలేక పోయిందని, ఆయన ఎక్కడ పుట్టారో సరైన సాక్ష్యం లేదన్నారు. ఏది ఏమైనా ఎవరి నమ్మకం వారికి ఉంటుందని కానీ ఎన్నికల సమీపిస్తున్న వేళ మత విధ్వంసాన్ని కరీంనగర్ ఎంపి బండి సంజయ్ సృష్టించాలని చూస్తున్నారని విమర్శించారు. హుస్నాబాద్‌లో ఆయన చేపట్టిన ప్రజాహిత యాత్రలో రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తల్లి గురించి చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవడంతో పాటు ఆయనకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇక బిఆర్ఎస్ మేడిగడ్డ సందర్శన ఒక రాజకీయ డ్రామా అని, కుంగిపోయిన ప్రాజెక్టు దగ్గరికి వెళతాననడం హాస్యస్పదంగా ఉందన్నారు. కెసిఆర్ జరిగిన తప్పును ఒప్పుకుని తప్పును సవరించుకుంటే బాగుంటుందని హితవు పలికారు. ఇంతకుముందు వందల సార్లు ముఖ్యమంత్రి కాళేశ్వరం సందర్శించిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. నిజనిర్ధారణ కమిటీ కాళేశ్వరం కుంగిపోయిందని చెప్తున్నా మేడిగడ్డ సందర్శిస్తామంటున్న మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు నష్టమే తప్ప ఏం లాభం లేదన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు అయిలేని సంజీవరెడ్డి, గూడ పద్మ, ఎగ్గోజు సుదర్శనచారి, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు జనగాం రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని చేతిపై మంటలు రేపుతున్న నరేష్

## విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించుకోవాలి

### ఎస్ఎస్ఎఫ్ జాతీయ కమిటీ సభ్యులు నరేష్

**హుస్నాబాద్, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త :** విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించుకోవాలని సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యులు ఉప్పులేటి నరేష్ అన్నారు. గురువారం పట్టణంలోని కస్తూరిబా బాలికల విద్యాలయంలో సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ ఆదేశాల మేరకు హుస్నాబాద్ ఎస్ఐ తోట మహేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వం, వికాసం, మూడనమ్మకాలపై అవగాహన కల్పించారు. నరేష్ మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానం అభివృద్ధి చెందుతున్న తరునంలో ఇప్పటికీ మూఢ నమ్మకాలు నమ్మడం దురదృష్టకరమన్నారు. విద్యార్థి దశలోనే మూడనమ్మకాలను వీడి సమాజ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. దొంగ భూతవైద్యులు, స్వాములు ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని ఆర్థికంగా మోసం చేస్తున్నారన్నారు. దయ్యాలు, భూతాలు మంత్రాలు బూటకమని విద్యార్థులు సైన్సును మాత్రమే నమ్మాలన్నారు. అనంతరం సౌన్స్ మ్యాజిక్‌షో నిర్వహించారు, ఇనుప కత్తిని కడుపులో గుచ్చుకోవడం, నోట్లో మండలు లేపడం, గాలిలో విభూది సృష్టించడం, పేపర్లు కాల్చి చాక్లేట్‌లు చేయడం, విద్యార్థులు గడియారాలు మాయం చేసి రింగులు తీయడం లాంటి ప్రదర్శనలు చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ మమత, ఏఎస్ఐ మనెమ్మతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రామలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్‌గా మల్లేశం

**చేర్యాల (దూల్మిట్ట), ఫిబ్రవరి 29, ప్రభాతవార్త**
దూల్మిట్ట మండలం బెక్కల్ గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థాన కమిటీని గురువారం ప్రభుత్వం ప్రకటించింది. దేవస్థాన కమిటి సభ్యులుగా 6గురిని ప్రభుత్వం నియమించగా అందులో చైర్మన్‌గా చెప్పరి మల్లేశం కమిటి మెంబర్లు ఇమ్మడి శోభ, ధరావత్ శ్రీరాం, చెన్నోజు బ్రహ్మం, రాజుపేట మల్లేశం, స్వర్గం సాంబయ్యలను ప్రభుత్వం నియమించింది.

## ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**హుస్నాబాద్, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త :** ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని హుస్నాబాద్ మత్స్యకార ఉత్పత్తి దారుల సంఘం చైర్మెన్ పొన్నబోయిన శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం భారీ నిధులు కేటాయించిందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పథకం గురించి పత్స్యకార సంఘం గ్రామశాఖల అధ్యక్షులు అర్హులందరికి అవగాహన కల్పించాలన్నారు.



పొద్దుతిరుగుడు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

## కెసిఆర్ చొరవతో స్వరాష్ట్రంలో అభివృద్ధి

### ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

**తొగుట, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త :** తెలంగాణ తొలి సిఎం కెసిఆర్ ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమం జరిగిందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. తొగుట వ్యవసాయ మార్కెట్‌లో గురువారం సొసైటీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన పొద్దు తిరుగుడు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అయన ప్రారంభించి మాట్లాడారు. కెసిఆర్ హయాంలో అకుపచ్చ తెలంగాణ కోసం ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఉత్తర తెలంగాణకు గుండెకాయ లాంటి ప్రాజెక్టు మీద కాంగ్రెస్ నాయకులు అవినీతి అరోపణలు చేయడం సరికాదన్నారు. యాసంగి పంటలు ఎండిపోతున్నాయని వెంటనే సాగునీరు అందించి రైతులను అదుకోవాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో వాస్తవాలను ప్రజలకు వివరించడానికే మేడిగడ్డ పర్యటన చేయడం జరుగుతుందన్నారు. పొద్దు తిరుగుడు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర రూ.6760 పొందాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారలు, పార్టీ నాయకులు బక్కి వెంకటయ్య, చిట్టి దేవేందర్‌రెడ్డి, క్రాంతి హరికృష్ణారెడ్డి, యాదగిరి, శ్రీకాంత్, రాంరెడ్డి, బాసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ఎండి. కలీమోద్దీన్, సుతారి లలిత రమేష్, స్వామి, అరుణ్‌కుమార్, గోవర్ధన్‌రెడ్డి, కొమురయ్య, రాంరెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కనకయ్య, నర్సింహులు, పోచయ్య, బిక్షపతి, అనిల్, అశోక్, వెంకట్, సుభాష్, బాలరాజు, బైరాగౌడ్, ఎల్లం, రాజు, రమేష్‌గౌడ్, నర్సింహులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**జహీరాబాద్, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త:** జహీరాబాద్‌లోని 132/33 కెవి సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా మార్చి 1వ తారీఖున డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ డీఈ లక్ష్మినారాయణ తెలిపారు. ఝరాసంఘం ఫీడర్ సిటి ఫెయిల్ అయినందున మరమ్మత్తుల కొరకు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 గంటల వరకు డివిజన్ పరిధిలోని రంజోల్, పస్తాపూర్, అల్గోల్, దిగ్వాల్, వెంకటాపూర్, సజ్జాపూర్, మాచనూర్, ఝరాసంగం, ఎల్గోయి, జీర్లపల్లి, రాయికోడ్, కర్చల్, మహబత్‌పూర్, సింగితం, న్యాల్‌కల్, హద్నూర్, దప్పూర్, చాల్కి, మెటల్‌కుంట, మామిడ్గి, మిర్జాపూర్(బి), సత్వార్, ధనసిరి, బూచినెల్లి, చిన్న హైద్రాబాద్, మల్చలమ్మ విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరపరా ఉండదని, అందుకు వినియోగదారులు విద్యుత్ అధికారులకు తమ వంతు సహకరించాలని లక్ష్మినారాయణ సూచించారు.

# ప్రమాదకర బిజెపిని వచ్చే ఎన్నికల్లో ఓడిద్దాం

**సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్**




మాట్లాడుతున్న మంద పవన్

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త :**
కుల, మత, విద్వేషాలను రెచ్చగొడుతూ దేవుడి పేరుతో రాజకీయాలు చేస్తూ.. అభివృద్ధిని గాలికి వదిలేసిన బిజెపి ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో గద్దె దింపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో గురువారం అయన సిపిఐ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సంస్కారం లేకుండా నోటికి ఏది వస్తే అది మాట్లాడుతూ తల్లులందరిని అవమానపరిచేలా వ్యాఖ్యాలు చేసిన ఎంపి బండి సంజయ్ వెంటనే తల్లులందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో బిజెపి అధికారంలోకి రాక ముందు విదేశాల్లో ఉన్న నల్ల ధనాన్ని వెనక్కి తీసుకవచ్చి దేశంలో ప్రతి పేదవాడి ఖాతాలో రూ. 15 లక్షలు జమ చేస్తామని చెప్పి మోసం చేసిన బిజెపికి ప్రజలు గుణపాఠం చెబుతారని తెలిపారు. యువతకు ఏడాది 2 కోట్ల ఉద్యోగా అవకాశాలు కల్పిస్తామని మోసం చేశారని తెలిపారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 247 ప్రభుత్వ రంగ సంస్థలు మూడపడ్డాయని తెలిపారు. నాణ్యమైన విద్యను అందుబాటులో ఉంచడంలో కేంద్రం పూర్తిగా విఫలమైందన్నారు. కార్మికులు అనేక పోరాటాలు చేసి సాధించుకున్న 44 లేబర్ చట్టాలనువ 4 కోడ్‌లాగా విభజించి కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. బండి స ంజయ్ ప్రజాహిత యాత్ర పేరుతో ప్రజల్లో కుల, మత విద్వేషాలు రెచ్చగొడుతూ అయోధ్య రాముడిని, కృష్ణుడి పేరుతో రాజకీయాలు చేస్తూన్నారని తెలిపారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ తల్లిని బండి సంజయ్ అవమానించేలా వ్యాఖ్యాలు చేశారని వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రమాదకరమైన బిజెపి మరోసారి అధికారంలోకి వస్తే దేశ ప్రజలు దారుణమైన పరిస్తితులు ఎదుర్కొవల్సి వస్తుందన్నారు. సమావేశంలో సిపిఐ నాయకులు కిష్టపురం లక్ష్మణ్, కనకుంట్ల శంకర్, గజభీంకర్ బన్సీలాల్, జేరిపోతుల జనార్ధన్, బెక్కంటి సంపత్ పాల్గొన్నారు.



పరీక్షా కేంద్రాలను పరిశిలిస్తున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రమేష్

## ఇంటర్ పరీక్షా కేంద్రాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**కొల్చారం, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియేట్ పరీక్షా కేంద్రాన్ని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు రమేష్ ఆకస్మికంగా గురువారం తనిఖీ చేశారు. ఇంటర్మీడియేట్ పరిక్షలు నడుస్తున్న దృష్ట్యా ఆయా కళాశాలలో ఇంటర్ పరీక్షలు జరుగుతున్న తీరును పరశీలించారు. నిఘా నేత్రాల ఏర్పాటును పని తీరును, పరీక్షలు నిర్వహిస్తున్న కేంద్రాలవద్ద పోలీస్ బందోబస్తుతోపాటు పరీక్షలు సజావుగా జరిగేందుకు అధికారులు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. పరీక్ష జరుగుతున్న తీరు, విద్యార్థుల హాజరు వివరాలను పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్లు కళాశాల ప్రిన్సిపాళ్లు అదనపు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం పరీక్షా కేంద్రంలోని పరీక్ష గదులను పరిశీలించి పరీక్షలు రాస్తున్న అభ్యర్థులకు పరీక్షా కేంద్రంలో కల్పించిన ఫర్నిచర్, త్రాగునీరు, ప్రథమ చికిత్స వంటి సౌకర్యాలను పరశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా తగిన మౌళిక సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంట తాసీల్దార్ గఫార్, పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్లు, ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

## ప్రారంభమైన ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు

### నిమిషం ఆలస్యం కారణంగా ఇద్దరు విద్యార్థులను అనుమతించని అధికారులు



విద్యార్థుల హాల్ టికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

**హుస్నాబాద్, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త :** ఇంటర్‌మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు గురువారం హుస్నాబాద్‌లో ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. హుస్నాబాద్‌లో ఏర్పాటు చేసిన మూడు పరీక్ష కేంద్రాలలో మొత్తం 602 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉంది. కాగా బాలుర కళాశాలలో 167 మంది విద్యార్థులను కేటాయించగా అందులో 165 మంది హాజరై మరో ఇద్దరు గైర్హాజర్ కాగా బాలికల కళాశాలలో 278 మంది విద్యార్థులను కేటాయించగా అందులో 265 మంది హాజరై 13మంది గౌర్హాజరయ్యారు. ఇక ఆదర్శ(మోడల్‌స్కూల్) పాఠశాలలో మొత్తం 157 మందికి 155 మంది హాజరై ఇద్దరు గైర్హాజరైనట్లు ఆయా కళాశాలల చీఫ్ సూపరింటెంట్‌లు రాజు, రవిందర్, అన్నపూర్ణలు తెలిపారు. పరీక్ష రాసేందుకు నిమిషం ఆలస్యం నిబందన కారణంగా సెంటర్ వద్దకు 5నిమిషాల ఆలస్యంగా వచ్చిన ఇద్దరు విద్యార్థులను అధికారులు అనుమతించక పోవడంతో విద్యార్థులు నిరాశతో వెనుదిరిగారు.

## సేంద్రియ ఎరువుల వాడకం పెరగాలి : ఎవో

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త:** సేంద్రియ ఎరువుల వాడాకాన్ని అలవాటు చేసుకోవాలని వ్యవసాయాధికారి లక్ష్మి ప్రవీణ్ అన్నారు. గురువారం నాడు పట్టణ కేంద్రంలోని ఎరువుల దుకాణాలలో విత్తనాల నిల్వలను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మోతాదుకు మించి యూరియా వాడటం వల్ల వరి పంటకు మోగి పురుగు వ్యాధి సోకి వరి పంట దిగుబడి తగ్గిపోతుందని అన్నారు. పంటలకు తెగుళ్ల వ్యాధి సోకితే వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు. రైతులకు తీసుకున్న మందులకు రశీదులు ఇవ్వాలని దుకాణ యజమానులకు సూచిచారు.



అధికారులు సీజ్ చేసిన మట్టి టిప్పర్ లారీ

## అక్రమంగా మట్టిని తరలిస్తున్న లారీ సీజ్

**రామాయంపేట మున్సిపాలిటీ, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త :**
ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఇరిగేషన్ ఏఈ కుశాల్ అన్నారు. గురువారం రామాయంపేట మండల పరిధిలోని పర్వతాపూర్ గ్రామ శివారులోని చెరువునుండి అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఒక టిప్పర్‌లారీని ఇరిగేషన్ అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు నుండి అక్రమంగా మట్టి తరలిస్తున్నారని కొందు ఫిర్యాదు చేయగా గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. చెరువు నుండి లారీలో మట్టిని తరలిస్తుందగా దాన్ని పట్టుకొని పోలీస్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ఎంతటి వారైన చెరువుల నుండి అక్రమంగా మట్టి తరలిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

### గవ్వలపల్లిలో ఇసుక ట్రాక్టర్...

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త:** అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపారు. గురువారం నాడు మండల పరిధి గవ్వలపల్లి చౌరస్తా వద్ద ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేశామని, డ్రైవర్ ప్రసాద్‌పై కేసునమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.




ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు

## మణికొండలో మంచినీటి సమస్యను తీర్చాలని వినతి



మణికొండలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని జల మండలి మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న స్థానికులు.

**నార్సింగి, ఫిబ్రవరి 29 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపల్ పరిధిలోని మణికొండ క్వార్టర్స్ ప్రాంతంలో మంచినీటి సమస్య తీవ్ర రూపం దాల్చిందని,వెంటనే నీటి సరఫరాను మెరుగు పర్చాలని కోరుతూ గురువారం కమీషనర్‌కు, జల మండలి మేనేజర్‌కు కౌన్సిలర్ శైలజ వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పుడిప్పుడే ఎండలు ముదురుతున్నాయని, ఇళ్లల్లోని బోర్లు ఎండిపోతున్నాయన్నారు. ఈ సమయంలో జల మండలి నుంచి వచ్చే నీరు కూడా నాలుగు రోజులకు ఒక సారి సరఫరా చేస్తుండడంతో నీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారన్నారు. సకాలంలో ప్రజలు బిల్లులు చెల్లిస్తున్నా, కనీస వసతి అయిన మంచినీటి సరఫరాను చేయాల్సిన బాధ్యత అధికారులు, ప్రజా ప్రతినిధులపై ఉందని శైలజ పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో దివ్యజ్యోతి యువజన సంఘం చైర్మన్ వెంకట్‌రెడ్డి, అధ్యక్షులు నరేష్, ప్రధాన కార్యదర్శి నరేందర్, సభ్యులు అనిల్, మహేశ్వర్, మోహన కృష్ణ, శివకుమార్, శంకర్ తదితరులు ఉన్నారు.

## శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంలో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉంది : అసిస్టెంట్ ప్రొఫెసర్



కార్యక్రమంలో పాల్గొన్న ఉస్మానియా విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జె.రుక్మిణి తదితరులు

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 29 ప్రభాతవార్త:** శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంలో ప్రపంచంలో భారతదేశం అగ్రస్థానంలో నిలుస్తోందని ఉస్మానియా విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జె.రుక్మిణి అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా గురువారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల ఎంబిఎ సెమినార్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ రుక్మిణి పాల్గొని ప్రసంగించారు. ఆధునిక జీవితంలో సైన్స్ ప్రాముఖ్యత మరింత పెరిగిందని అన్నారు. ఇందుకు ఇటీవల భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) సాధించిన ఘనవిజయాలు ప్రపంచ వ్యాప్తంగా దేశానికి ఎంతో పేరును తెచ్చిపెట్టిందన్నారు. సైన్స్ రంగంలో శాస్త్రవేత్తలు నిర్వహించిన పరిశోధనలు సమాజ పురోగతికి తోడ్పడాలన్నారు. అంబేద్కర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ జి.సరోజ వివేక్ మాట్లాడుతఊూ నిత్యజీవితంలో సైన్స్ పాత్ర తెలిపి, విద్యార్థులు పరిశోధన రంగంలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల అకాడమి డైరెక్టర్, ప్రిన్సిపాల్, సైన్స్ హెచ్ఓడి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ శేషులతచే 'త్యాగరాజ పంచరత్న కీర్తనలు'

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 29 ప్రభాతవార్త:** సంగీత విద్వాన్, సంగీత అలంకార్ డాక్టర్ శేషులతచే 'త్యాగరాజ పంచరత్న కీర్తనలు' కార్యక్రమాన్ని చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గాన సభలోని కళాసుబ్బారావు కళావేదికలో నిర్వహించబోతున్నట్లు నిర్వాహక సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వి.రమణకుమారి, ఎంవి.సుబ్బలక్ష్మి వివరించారు. మార్చి 5న సాయంత్రం జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దూరదర్శన్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ పాలకుర్తి మధుసూదన్‌రావు హాజరయ్యే ఈ కార్యక్రమాన్ని ప్రముఖ సాహితీవేత్త, సినీకవి, దర్శకులు డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ అధ్యక్షత వహిస్తారన్నారు. ఈ సందర్భంగా జరిగే సభలో గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి కూడా హాజరవుతారు. 'త్యాగరాజ పంచరత్న కీర్తనలు' కార్యక్రమంలో వయోలిన్‌పై ఎం.శశిభూషణ్ రావు, మృదంగంపై డి.తారకరామ్ వాద్యసహకారాన్ని అందిస్తారు.

## మహిళలపై గృహహింస, లైంగిక వేధింపులపై న్యాయ సలహాలు



కార్యక్రమంలో పాల్గొన్న లక్ష్మీపద్మజ తదితరులు

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 29 ప్రభాతవార్త:** అపూర్వ మహిళా శిశు సంక్షేమ సంస్థ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ న్యాయ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో 'న్యాయ సలహా అవగాహన శిబిరం' గురువారం గాంధీనగర్‌లోని అపూర్వ ప్రాంగణంలో అధినేత్రి పి.లక్ష్మీపద్మజ ఆధ్వర్యంలో జరిగింది. ఈ శిబిరంలో డిస్ట్రిక్ లీగల్ సెల్ సభ్యురాలు సరోజ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల ప్రొఫెసర్ వరలక్ష్మి, లా కళాశాల విద్యార్థులు అపూర్వ, మహ్మద్ జొహైద్, కరుణాకర్, శ్రీజ, శృతి, షేక్ సనా, మేఘ నరాయి తదితరులు ప్రముఖులు హాజరైనారు. ప్రధానంగా మహిళలకు సంబంధించిన అంతర్గత గృహ హింస, పని ప్రదేశాలలో లైంగిక వేదింపులు వంటి వాటి నిర్మూలనకు తీసుకోవాల్సిన న్యాయసలహాలు, సూచనలు, చర్యలకు సంబంధించి విపులంగా చర్చించడంతో పాటు చట్టపరమైన పరిష్కారాలను అడిగి తెలుసుకుని సలహాలను అందించారు. ఆయా సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే సంకల్పంతో డివిజన్‌లోని అన్నానగర్, గిరినగర్ ప్రాంతాలను పర్యటించింది.

## దేశాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలి : ఎమ్మెల్యే

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 29 ప్రభాతవార్త:** విద్యతో పాటు విద్యార్థినీ విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సూపర్‌ట్విన్ సిటీస్ హైస్కూల్ అండ్ ప్లేస్కూల్ వార్షికోత్సవ సభ ప్రిన్సిపాల్ న డాక్టర్ ఎం.చంద్రమోహన్, కరస్పాండెంట్ ఎం.శశికళ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ సైబరాబాద్ కమీషనరేట్ అదనపు డీసీపీ పోలా విజయకుమార్, అవోపా రాష్ట్ర అధ్యక్షుడు మల్లిపెద్ది శంకర్, తెలంగాణ రాష్ట్ర అవోపా ఫైనాన్స్ సెక్రటరీ కందికొండ శ్రీనివాస్, టిఎస్ఎస్‌పిడిసిఎల్ జనరల్ మేనేజర్ మిర్యాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలిరించాయి. దేశభవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని, వీరంతా ఉన్నత చదువులు అభ్యసించి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు.

## డ్రంక్ డ్రైవింగ్‌ను అరికట్టడానికి మద్దుతు

**శామీర్‌పేట ఫిబ్రవరి29,ప్రభాతవార్త :** ప్రముఖ ఆల్కో-బెవ్ కంపెనీలలో డియాజియో ఇండియా 50 అధునాతన ఆల్కహాల్ బ్రీత్ ఎనలైజర్‌లను అందించడం ద్వారా డ్రంక్ డ్రైవింగ్‌ను అరికట్టడంలో తెలంగాణ పోలీసులకు తన మద్దతును అందించింది.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జనరల్ పోలీస్ రవిగుప్తా,రైల్వే అదనపు డిజిపి మహేష్, భగవత్,సీనియర్ ప్రముఖులు,తదితర అధికారులు పాల్గొన్నారు

## చిన్నారెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో వ్యవసాయం మరింత వృద్ధి సాధిస్తుంది

-రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర వైద్యనాథ్



చిన్నారెడ్డిని సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 29 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా డాక్టర్ జి.చిన్నారెడ్డిని నియమించడం వల్ల రాష్ట్రంలో వ్యవసాయం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర వైద్యనాథ్ పేర్కొన్నారు. గురువారం ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులైన చిన్నారెడ్డిని వైద్యనాథ్ నేతృత్వంలో సంఘం చైర్మన్ కృపాకర్ రెడ్డి, చంద్రశేఖర్, రామచంద్రరావు,మానస, వాణిలతో పాటు అధికారుల సంఘం సభ్యులు కలిసి సత్కరించారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో చిన్నారెడ్డి చేసిన కృషి ఎంతో విలువైందని, వ్యవసాయరంగం మరింత వృద్ధిచెందుతుందన్నారు. ఈ పదవి ఆయనకు ఇవ్వడం ద్వారా వ్యవవసాయ అభివృద్ధితోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని భావించినట్లు వివరించారు.

## మేరు సంఘం ఎన్నికలకు గ్రామ, మండల, జిల్లా నాయకులు సహకరించాలి

**సైఫాబాద్, ఫిబ్రవరి 29 ప్రభాతవార్త:** తెలంగాణ మేరు సంఘంకు త్వరలో ఎన్నికలు జరుగుతున్న నేపధ్యంలో గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో ఎన్నికలు నిర్వహించుకుని పేర్ల జాబితాను రాష్ట్ర సంఘం కార్యాలయంకు పంపాలని సంఘ అడ్‌హక్ కమిటి కోరింది. ఈ మేరకు గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం ట్రస్ట్ చైర్మన్ పి.నర్సింగ్‌రావు, ముఖ్య సలహాదారు కె.భాస్కర్‌రావు, అడహక్ కమిటి కన్వీనర్ అడపా వెంకటేశ్వర్‌రావు, నాయకులు ఎస్.బి.సంఘమేశ్వర్, డి.నర్సింగ్‌రావు, కె.వెంకటేశ్ తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే ఆనేక జిల్లాల్లో ఎన్నికలు జరిగాయని, ఇంకా కొన్ని జిల్లాల్లో మాత్రమే జరగవలిసి ఉందని చెప్పారు. మార్చి 31వ తేదీలోగా ఎన్నికలు నిర్వహించుకోవాలని ఆ తరువాత పేర్ల జాబితాను పంపించినా అంగికరించేది లేదని హెచ్చరించారు. ఇప్పటి వరకు వివిధ జిల్లాల నుంచి 9 వేల మంది తమ పేర్ల జాబితాను పంపించడం జరిగిందని, మిగిలిన 3, 4 వేల మంది త్వరితగతిన పంపాలని వారు కోరారు. లేని పక్షంలో అడ్‌హక్ కమిటికి ఏలాంటి బాధ్యత వహించదన్నారు.

## దళితజాతిని అణిచివేయాలనే కుట్రను తిప్పికొట్టాలి

-మాలమహానాడు ఇండియన్ నేషనల్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ రాజు

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 29 ప్రభాతవార్త:** దళితజాతి మొత్తానికి చెందాల్సిన ఎస్సీ రిజర్వేషన్‌లు ఒక్కమాదిగలకే 12శాతం కావాలనే ఎస్సీ వర్గీకరణ నినాదం అని, స్వార్ధం, కుట్రపూరిత ఉద్యమం చేపట్టిన ఎంఆర్‌పిఎస్‌కు వ్యతిరేకంగా గట్టిగా గళం వినిపించాలని మాల, మాల ఉపకులాలు ప్రజలకు మాలమహానాడు ఇండియన్ నేషనల్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ విఎల్.రాజు పిలుపునిచ్చారు. గురువారం బాగ్‌లింగంపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో మాలలు కన్నా మాదిగ కుల జనాభా ఎక్కువ శాతం ఉన్నారనే అసత్యప్రచారంను తెలంగాణలోని మాల, ఉపకులాలు ప్రజలు తిప్పికొట్టాలన్నారు. దేశంలోనూ, తెలంగాణ, ఏపీలోనూ దళితజాతిని అణిచివేయాలనే కుట్రతో ఎంఆర్‌పిఎస్‌ను మనువాద పాలక పార్టీలు కాషాయ మాఫియా ఆర్ఎస్ఎస్, బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ పెంచి పోషించాయని ఆరోపించారు. ఎస్సీ కులాలను వర్గీకరణ పేరుతో సామాజికంగా విభజన చేసి శాశ్వతంగా శత్రువులుగా మార్చడానికి ప్రధానీ మోదీ, సిఎం రేవంత్‌రెడ్డి సర్కార్‌లు పూనుకున్నాయని విమర్శించారు. దేశంలో దళితజాతి బిజెపి, కాంగ్రెస్ పార్టీలతో పాటు వర్గీకరణకు మద్దతునిచ్చే బిఆర్ఎస్, వైఎస్ఆర్‌సిపి, టిడిపి, జనసేన, కమ్యునిస్ట్ పార్టీలపైన తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. వర్గీకరణ అంతం మాలల అంతం అనే నినాదంతో కదం తొక్కాలన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా గళం వినిపిస్తున్న మాల ఉద్యమ సంస్థలు ఐక్యత కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

## ప్లేస్‌మెంట్ డ్రైవ్ ద్వారా విద్యార్థులకు ఉద్యోగావకాశాలు

-డైరెక్టర్ డాక్టర్ రిషికాంత్

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 29 ప్రభాతవార్త:** విద్యార్థినీ విద్యార్థులకు డిగ్రీ పూర్తి చేసుకున్న వెంటనే ఉద్యోగవకాశాలను కల్పించడానికి బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాలలో 'ప్లేస్‌మెంట్ డ్రైవ్'ను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ రిషికాంత్ అన్నారు. బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాలలలోని సెమినార్ హాల్‌లో ప్లేస్‌మెంట్-ట్రైనింగ్ విభాగం ఆధ్వర్యంగలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ రిషికాంత్ హాజరై ప్రారంభించి ప్రసంగించారు. కెరీర్ డెవలప్‌మెంట్ సెల్ విభాగాధిపతి మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణను కలిగిన మేనేజ్‌మెంట్ సౌజన్యంతో అనేక ప్రముఖమైన టాప్ మోస్టెడ్ కంపెనీలు కళాశాలలో 'ప్లేస్‌మెంట్ డ్రైవ్' నిర్వహించడానికి యాజమాన్యం సహకారంతో ముందుకువెళ్లడం జరుగుతుందన్నారు. మరో 15 లేదా 20 రోజుల్లో 7,8 కంపెనీలను ఈ డ్రైవ్‌కు ఆహ్వానించామన్నారు. నేడు నిర్వహించచిన డ్రైవ్‌లో ఎల్అండ్ టి, ఫాబో కంపెనీలకు అనేక మంది విద్యార్థులు హాజరై తమ నైపుణ్యాలను హెచ్ఆర్‌లు పరిశీలించారు. సుమారు 20 మంది విద్యార్థులు ఈ డ్రైవ్‌లో షార్ట్‌లిస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శేఖర్, ఎల్ అండ్ టి(హెచ్ఆర్) మణికంఠ, ఫాబో సర్వీసెస్ హెచ్ఆర్ హెడ్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతివిద్యార్థి సివి రామన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



ప్రదర్శనను తిలకిస్తున్న ప్రిన్సిపల్ వేణుగోపాల్

**హైదరాబాద్,ఫిబ్రవరి 29,ప్రభాతవార్త:** ప్రతి విద్యార్థి సర్ సివిరామన్‌ను ఆదర్శంగా తీసుకుని మంచి ఆదర్శవంతమైన ప్రతిభావంతమైన విద్యార్థులుగా తయారుకావాలని అంబర్‌పేట్ డ్రీమ్స్ కిడ్స్ అప్పర్ ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపల్ వేణుగోపాల్ అన్నారు. ఈమేరకు గురువారం స్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్స సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్యవిజ్ఞానిక ప్రదర్శనలు ఆయన పరిశీలించారు. సైన్స్ అనేది ఒకశాస్త్రీయ విద్య అన్నారు. మన జీవితాన్ని సుఖవంతం చేయడానికి వ్యవసాయం ఆరోగ్యం వంటి రంగాల్లో పురోగతి సాధించడానికి సైన్స్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. భారతదేశంలో జరపుకునే పండగలకు సైన్స్ ముడిపడి ఉందని ,మన సంప్రదాయంలో కూడా సైన్సే ఇమిడి ఉందన్నారు. దీనిపై విద్యార్థులకు మరింత అవగాహన పెంపొందించుకోవాల్సి ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కాంట్రాక్ట్ పనులలో వడ్డెరులకు 20 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేస్తున్న వేముల వెంకటేష్, రమేష్ తదితరులు

**సైఫాబాద్, ఫిబ్రవరి 29 ప్రభాతవార్త:** వడ్డెర కులస్తులకు రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ పనులలో 20 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని జాతీయ వడ్డెర సంఘం, తెలంగాణ వడ్డెర కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల వెంకటేష్, అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.రమేష్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం వినతి పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం తరతరాలుగా వడ్డెర కులస్తులు చేసే పనులు బిల్డింగ్‌లకు పునాదులు తీయడం, రోడ్లు వేయడం, కెనాల్స్, బావులు తవ్వడం, పెద్ద, పెద్ద డ్యాములు కట్టడం, ప్రాజెక్టుల నిర్మాణంలో పాల్గొనడం వంటి పనులు చేస్తూ జీవనాధరం పొందుతున్నారని తెలిపారు. ఈ కాంట్రాక్ట్ పనులలో గత ప్రభుత్వాలు వడ్డెరులకు ప్రత్యేకంగా రిజర్వేషన్‌లు కల్పించాయని కాగా బిఆర్ఎస్ ప్రభుత్వం జివొ నెంబరు 59ని విడుదల చేసి ఎస్సీ, ఎస్టీ, వడ్డెర, సగరలకు 15 శాతం నుంచి 24 శాతం వరకు రిజర్వేషన్‌లు కల్పించిందని, దీంతో వడ్డెరలకు కేవలం 3 శాతం రిజర్వేషన్‌ల మాత్రమే వర్తించిందని విచారం వ్యక్తం చేశారు. ప్రస్తుతం వడ్డెరులకు కాంట్రాక్ట్ పనులు లేకపోవడంతో ఆనేక ఇబ్బందులకు గురవుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వడ్డెరులకు న్యాయం చేయడానికి ప్రభుత్వ పనులలో 20 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వడ్డెరుల సమస్యలను సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

# ఆద్యంతం రసభరితం భక్తపోతన నాటకం



భక్తపోతన నాటకంలో ఒక సన్నివేశం

**రవీంద్రభారతి, ఫిబ్రవరి 29 ప్రభాతవార్త :** మహాభాగవత పౌరాణిక గ్రంథ రచయిత, సుప్రసిద్ధ తెలుగుకవి పోతన జీవితానికి ప్రతిబింబంగా ఆయన వ్యక్తిత్వంలో భాగమైన భక్తి, వినయం, పాండిత్యం అన్నింటినీ కలబోసి ఆధ్యాత్మిక భక్తిభావనను రేకెత్తిస్తూ అద్భుతంగా, ఆసక్తికరంగా ప్రదర్శింపబడిన నాటకం భక్తపోతన రసవత్తరంగా సాగింది. రంగస్థలాన్ని, నాటకరంగాన్ని, కళాకారులను ప్రోత్సహించడమే ధ్యేయంగా ప్రతీనెలా నాటకం-ప్రేక్షకుడికి వినోదం-నటుడికి ఆనందం-అదే మాబాట, మామాట నినాదంతో ప్రతీనెలా నాటక ప్రదర్శనలను నిర్వహిస్తున్న రసరంజని హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో భక్తపోతన నాటకం ప్రదర్శింపబడింది. కాసుల కోసం తన కావ్యకన్యను అమ్మనని, ఆత్మగౌరవంతో వ్యవసాయం చేసుకుని జీవించిన పోతన కథాంశంగా సిఎస్ఆర్ ఆంజనేయులు రచన, డా. చింతలపాటి శూలపాణి దర్శకత్వంలో, శ్రీ చింతలపాటి సోమరాజు సాంస్కృతిక సేవాసంస్థ, వనస్థలిపురం హైదరాబాద్ వారి సమర్పణలో రూపొందిన భక్తపోతన నాటకం ప్రధాన పాత్రల్లో పోతనగా శూలపాణి, శ్రీరాముడుగా వెంకట్, సరస్వతిగా రాజ్యలక్ష్మి, శ్రీనాథుడుగా ప్రసాదరాయశర్మ తదితరులు వారివారి పాత్రలకు జీవంపోసి అధికసంఖ్యలో విచ్చేసిన రంగస్థల ప్రేమికులు, ఔత్సాహిక ప్రేక్షకుల మన్ననలు, ప్రశంసలు అందుకున్నారు.

# ఇంట్లో అగ్నిప్రమాదం.... సుమారు రూ.30లక్షల ఆస్తినష్టం



కాలి బుడిదైన సామాగ్రిని చూపిస్తున్న బాధితురాలు

**తార్నాక, ఫిబ్రవరి 29 ప్రభాతవార్త:** తార్నాక స్ట్రీట్ నెం.1లో ఓ ఇంట్లో విద్యుత్ షాక్ కారణంగా గురువారం అగ్నిప్రమాదం సంభవించింది. ప్రమాదం జరిగిన సమయంలో ఇంటికి తాళాలు వేసి ఉండటంతో ఎవరు వెళ్లేందుకు వీలుకాకపోవడంతో ఇల్లు పూర్తిగా దగ్ధం అయ్యింది. ప్రమాద సయంలో ఇంట్లో ఉన్న సామాగ్రి పూర్తిగా కాలిబూడిద అయ్యింది. మంటల్లో 7 తులాల భంగారు వస్తువులు, రూ.5లక్షల నగదు, రెండు ఏసీలు, టీవి, ఫర్నిచర్, మియాపూర్ స్థలం డాక్యుమెంట్, దుస్తులతో పాటు ఇల్లు పూర్తిగా కాలిబూడిద అయ్యింది. ప్రమాదంతో సర్వం కోల్పోయానని బాదితురాలు స్మిత కోటేష్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులు ఫిర్యాదుతో అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. కాని అప్పటికే విలువైన వస్తువులన్ని కాలిబూడిదయ్యాయి. సర్వం కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఘటనా స్థలానికి డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మోతె శోభన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు త్రినేత్ర గౌడ్, బిజేపీ నాయకులు వెంకటేష్ గౌడ్, ఆకుల శ్రీనివాస్ చేరుకొని పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారం బాదితులకు సహాయం అందేవిధంగా చూస్తామని చెప్పారు.

## విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీయాలి -ఐఐసిటి సైంటిస్ట్ రమేష్

**హైదరాబాద్, ఫిబ్రవరి 29 ప్రభాతవార్త** విద్యార్థులలో దాగిఉన్న సృజనాత్మకను వెలికితీయాల్సిన అవసరం ఉందని ఐఐసిటి శాస్త్రవేత్త రమేష్ అన్నారు. హబ్సిగూడ భాష్యం పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫేర్‌కు ముఖ్యఅతిదిగా హాజరు అయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు మరిన్ని ప్రదర్శనలు చేయడం ద్వారా విద్యార్థులకు భవిష్యత్తులో ఎంతో ఉపయోగంగా ఉంటున్నారు. ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దుర్గాదేవి, స్వాతిలు మాట్లాడుతూ తాము విద్యార్థులకు విద్యతో పలు ఆసక్తి ఉన్న వాటిపై శిక్షణ ఇస్తున్నామని వెల్లడించారు. ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయిలో స్దిరపడే విధంగా శిక్షణలు ఇస్తున్నామన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు అంశాలు ఆకట్టుకున్నాయి.

## రంగానగర్‌లో భక్తజనసందోహం మధ్య శ్రీ గజ ముఖేశ్వర శివలింగ ప్రతిష్టాపన

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 29 ప్రభాతవార్త** అత్యంత భక్తిశ్రద్దలతో శ్రీగజ ముఖేశ్వర లింగ ప్రతిష్ట కార్యక్రమం భారీ జనసమూహం మధ్య జరిగింది. చింతల్ డివిజన్ రంగానగర్ కాలనీలోని శ్రీ సీతారామాంజనేయ రామ లింగేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య గత మూడు రోజులుగా భక్తులకోలాహలం మధ్య విగ్రహ ప్రతిష్టాపనోత్సవ కార్యక్రమం జరిగింది. గురువారం పంచమి రోజున ప్రాత:కాల పూజలు, రత్నన్యాస, ధాతున్యాస, బీజన్యాస సహిత వివిధ దేవతాహోమాలు మాఘ బహుళ పంచమి స్వాతి నక్షత్ర యుక్త వృశభలగ్న పుష్కరాంభమున శ్రీ గజ ముఖేశ్వర శివలింగం(కాశీలింగం) ప్రతిష్ట, యంత్రస్థాపన ,బలి పూర్ణాహుతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. రంగానగర్ కాలనీ సంక్షేమ సంఘ అధ్యక్షులు బండారు వరప్రసాద్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి లక్ష్మణరావు, రామ్‌ప్రసాద్, సత్యనారాయణ, సతీష్, పద్మజా రెడ్డి, శాంత, అనంతరావు, రామకృష్ణ, ఎల్లప్ప, సదానంద్, సరోజ తదితలు పాల్గొన్నారు. విగ్రహ ప్రతిష్టాపనలో రంగానగర్‌తో పాటు చుట్టుపక్కల చంద్రానగర్, దుర్గయ్యనగర్, శ్రీసాయికాలనీ తదితర ప్రాంతాల నుండి భక్తులు పేద్దఎత్తున పాల్గొని తీర్థ,ప్రసాదాలు స్వీకరించారు.సాయంత్రం ఆరుగంటలకు శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు.

## అపార్ట్‌మెంట్స్‌లో దొంగల హల్‌చల్..

**కొంపల్లి, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త** నిజాంపేట మున్సిపల్ కార్పోరేషన్ పరిధి బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జనరేటర్, వాహనాల బ్యాటరీలు, కార్ల టైర్లు దొంగతనాలు భారీగా జరుగుతున్నాయి. దొంగలు అర్ధరాత్రి సమయంలో అపార్ట్‌మెంట్స్‌లోని జనరేటర్లు, కార్లను టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారు. రాత్రి సమయంలో నిజాంపేట్ బండారి లేఔట్ రోడ్ నెంబర్ 2, 10, రాజు టవర్స్ సుమన్ ఆసయి టవర్స్‌లో జనరేటర్ల దొంగతనాలు జరిగాయని అపార్ట్‌మెంట్ వాసులు వాపోతున్నారు. వీటిపై బాచుపల్లి పోలీసులు శ్రద్ధ చూపి రాత్రి సమయంలో పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని స్థానికులు కోరుతున్నారు. రాత్రి సమయంలో అనుమానస్పదంగా తిరుగుతున్న వారిని చూడాలని స్థానికులు కోరారు.

## ప్రగతి నగర్ చెరువు వద్ద అతివేగంగా దూసుకొచ్చిన కారు..

**కొంపల్లి, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త** ప్రగతి నగర్ చెరువు వద్ద ఓ కారు అతివేగంగా దూసుకొచ్చి స్తంభానికి ఢీ కొంది. ప్రగతి నగర్ నుండి జెఎన్‌టియూ వైపు వస్తుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. కాగా ఒకరికి బలమైన గాయాలు అయ్యాయి.

## భారతరత్నకి అర్హురాలు తెలుగు గానతల్లి సుశీల

-శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



మెలోడీక్వీన్ ఆఫ్ మ్యూజిక్ అవార్డుతో సుశీలను సత్కరిస్తున్న గుత్తాసుఖేందర్‌రెడ్డి, ఆమని, దైవజ్ఞశర్మ, దామోదర్‌గుప్తా, మహ్మద్‌రఫీ తదితర అతిథులు

**రవీంద్రభారతి, ఫిబ్రవరి 29 ప్రభాతవార్త :** వివిధ భారతీయ భాషల్లో 50వేలకుపైగా ఆణిముత్యాల్లాంటి పాటలను గానమాధుర్యంతో ఆలపించి జాతికి స్ఫూర్తి, ఆహ్లాదం కలిగించిన పద్మభూషణ్, గానకోకిల పి.సుశీల భారతీయ అత్యున్నత పురస్కారం భారత రత్న అన్నివిధాలా అర్హులన్న తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి భారతజాతే కాకుండా యావత్ మానవజాతి జీవితకాలం ఆమెను గుర్తుంచుకొంటుందని అన్నారు. ఆమె గానమాధుర్యం నాడు నేడు కలకాలం వీనులవిందు చేస్తుందనడంలో ఏమాత్రం సందేహంలేదని శృతిలయ ఆర్ట్స్ అకాడమీ, సీల్‌వెల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో దైవజ్ఞశర్మ సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గుత్తా సుఖేందర్‌రెడ్డి విశిష్ట అతిథులు కోలేటి దామోదర్‌గుప్తా, డా. మహ్మద్‌రఫీ, జితేందర్‌రెడ్డి, కుసుమ భోగరాజు, నవరసగాయని ఆమని తదితరులతో కలిసి పి.సుశీలను ఘనంగా సన్మానించి నిర్వాహకులు సీల్‌వెల్ సీఎండి బండారు సుబ్బారావు, శృతిలయ కార్యదర్శి ఆమనిల తరఫున మెలోడీ క్వీన్ ఆఫ్ మ్యూజిక్ పురస్కారంతో సత్కరించి ఈ అవార్డు ఇవ్వడం ఎంతో సబబుగా ఉందన్నారు. పి.సుశీల తెలుగుజాతి సంపదని, భావితరాల కోసం ఆమె పాటలను భద్రపరిచి అందించాలని, ఆమెకు సన్మానం యావత్ తెలుగుజాతికి, గాయకులకు సన్మానంగా భావించాలని దామోదర్‌గుప్తా, మహ్మద్‌రఫీలు స్పష్టం చేశారు.

## పాత నేరస్తుడి రిమాండ్

**అల్వాల్, ఫిబ్రవని 29 ప్రభాతవార్త:** జంటనగరాలులో వరుస దొంగతనాలు తో పలుమార్లు జైలుకు వెళ్ళిన నేరస్తుడిని మరోసారి అల్వాల్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. జైలుకు వెళ్ళినా తీరు మారని ఈ నేరస్తుడిపై పిడి యాక్ట్ ఉండడం విశేషం. రిమాండ్‌కు సంబంధించి ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. శాలిబండకు చెందిన మహ్మద్ ఆవేజ్ అహ్మద్(40) హైదరాబాద్, సైబరాబాద్, రాజకొండ కమీషనరేట్ పరిధి లోని పోలీసు స్టేషన్లలో దొంగతనాలకు సంబంధించి పలు కేసులు నమోదై ఉన్నాయి. 2005లో మొదటిసారిగా దొంగతనం చేసి జైలుకు వెళ్ళాడు. దొంగతనాలే ప్రవృత్తిగా మార్చుకున్న ఇతనిపై 2016లో మేడిపల్లి, 2021లో కూకట్‌పల్లి పోలీసు స్టేషన్లలో పిడి యాక్ట్‌లు నమోదయ్యాయి. సహచర దొంగ సల్మాన్ బిన్‌తో కలిసి నారాయణకుడా పోలీసు స్టేషన్ పరిధిలో దొంగతనం చేసిన రాయల్ ఇన్‌ఫీల్డ్ బైక్‌తో అల్వాల్ ప్రాంతంలో ఇటీవల రెక్కీ నిర్వహించడం జరిగింది. ఈ నెలలో అయ్యప్ప నగర్‌లోని ఓ ఇంటిలో ఇరువురు దొంగతనం చేశారు. బంగారు, వెండి ఆభరాలను తస్కరించారు. బాధితులు ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఫిబ్రవరి 28వ తేదీన ఇరువు రిని అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనాలు చిట్టా బయట పడింది. మహ్మద్ అవేజ్ అహ్మద్ అలియాస్ అహ్మద్‌పై 100కు పైగా కేసులు ఉన్నా యని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

## యువకుడికి మూడేళ్ల జైలుశిక్ష

**బేగంపేట ఫిబ్రవరి 29,ప్రభాతవార్త :** బాలికను ప్రేమపేరుతో వెంట పడి వేధింపులకు గురిచేయడమే కాకుండా నగ్న ఫోటోలు ,వీడియోలు చూపించి బ్లాక్ మెయిల్ కు పాల్పడిన నిందితుడికి న్యాయమూర్తి మూడేళ్ల జైలు శిక్షను విధిస్తూ తీర్పు చెప్పారు. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ సంఘటన చోటు చేసుకుంది. సబ్ ఇన్స్‌పెక్టర్ కోర్వ గంగాధర్ కధనం మేరకు వివరాలిలా ఉన్నాయి. 2021సంవత్సరం అక్టోబర్ లో బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసించే ఓ బాలికతో మెదక్ జిల్లా అల్లాదుర్గ్‌కు చెందిన బి.సురేష్(21) మాటలు కలిపి పరిచయం పెంచుకున్నాడు.ప్రేమ పేరుతో వెంట పడ్డాడు.బాలికకు తరుచూ వీడియో కాల్స్ చేస్తుండేవాడు.ఈ క్రమంలో బాలిక ఫోటోలు,వీడియోలు మార్ఫింగ్ చేసి బాధితురాలితో పాటు ఆమె తల్లి దండ్రులకు పంపుతూ డబ్బులివ్వాలని వేధించేవాడు.దీంతో బాలిక తల్లి దండ్రులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.వారి ఫిర్యాదు మేరకు ఫోక్సో చట్టం కింద నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు కోర్టులో హాజరు పరిచారు.కేసు పూర్వాపరాలను విచారించిన నాంపల్లిలోని 12వ అదనపు మెట్రోపాలిటన్ సెషన్ జడ్జి టి.అనిత నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష ,రూ 5వేల రూపాయల జరిమానాను విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు.

## శ్రీశైలానికి రాజధాని ఏసీ బస్సులు

**అప్జల్‌గంజ్,ఫిబ్రవరి 29ప్రభాతవార్త:** హైదరాబాద్ నుండి శ్రీశైలం వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మొట్ట మొదటిసారిగా మార్చి2వ తేది నుంచి రాజధాని ఏసి బస్సులను నడుపుతున్నట్లు రంగారెడ్డి జిల్లా ఆర్‌టిసి మేనేజర్ ఎ.శ్రీధర్ తెలిపారు.ఈ బస్సులు బిహెచ్ఈఎల్,జూబ్లీబస్‌స్టేషన్,నుండి బయలుదేరి మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ ద్వారా శ్రీశైలం పుణ్య క్షేత్రం వెళ్తాయని ఆయన తెలిపారు. పెద్దలకు650 రూపాయలు,చిన్నపిల్లలకు 510 రూపాయలు బస్సు చార్జీలు ఉంటాయన్నారు. ప్రతిరోజు బస్సులు ఉదయం 5,గంటలకు, ఆరుగంటలకు,7,8,10,11గంటలకు,మధ్యాహ్నం 12గంటలనుంచి మధ్యాహ్నం 3గంట లకు బయలు దేరుతాయన్నారు.శ్రీశైలం ఉదయం5,6,7,8,9,10,11గంటలకు బయలు దేరుతాయని,మధ్యాహ్నం12, 1,2,3 గంటలకు బయలుదేరి నగరానికి చేరుకుంటాయన్నారు.

## జిఆర్‌పి యూనిట్ ఎన్నికలు

**గన్‌ఫౌండ్రి,ఫిబ్రవరి 29ప్రభాతవార్త:** టిఎన్‌జిఒ హైదరాబాద్ జిల్లా డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ ఆదేశాలమేరకు సికింద్రాబాద్ సూపరిండెంటెంట్ ఆఫ్ పోలీసు, జి.ఆర్.పి యూనిట్ ఎన్నికలను నిర్వహించారు.ఈ ఎన్నికల అధికారిగా కె.ఆర్.రాజ్ కుమార్,సహ ఎన్నికల అధికారిగా వైదిక్‌శాస్త్రి పర్యవేక్షణలో ఎన్నికలను నిర్వహించారు. సికింద్రాబాద్ యూనిట్ అధ్యక్షులు సి.దినేష్, ఉపాధ్యక్షులుగా ఎన్.బాస్కరరావు,బి.నవీన్, ఎస్.నరహరి,కార్యదర్శిగా జి.శ్రీదేవి, సంయుక్తకార్యదర్శిగా అహ్మద్‌అలీబాష, సుస్మిజాదవ్,కోశాధికారిగా ఎ.సతీష్‌కు మార్, సభ్యులుగా జె.అవినాస్‌రాజ్, సాయిరాఘవ, ఎల్.కె.ఎస్.సందీప్‌కుమార్,సంగీత నియమితులయ్యారు.ఈకార్యక్రమంలో టిఎన్‌జిఒ జిల్లా ప్రతినిధులు కె.శ్రీనివాస్, ముఖీమ్ ఖురేషీ,నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

# కలెక్టర్‌గారు కనికరించడండి!

## అద్దెభవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు
## అరకొర వసతులతో సతమతం

**నందిగామ, ఫిబ్రవరి 29. ప్రభాతవార్త :** పేరుగొప్ప ఊరు దిబ్బలా మారింది నందిగామ మండల పరిస్థితి. సామాన్యుడి వ్యయ ప్రయాసలకు చెక్ పెట్టాలని సదుద్దేశంతో పరిపాలన సౌలభ్యంకోసం గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ నందిగామ మం డలం ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో హడావుడి ఆర్భాటంతో పండగ వాతా వరణంలో తహసీల్దార్ కార్యాలయాన్నిఅప్పటి నాయకులు ఎంపిడివో తహసీల్దార్ కార్యాలయాన్ని అద్దె భవనాలలో ఏర్పాటు చేసింది. ఆశయం గొప్పదైన అమలులో లోపభూయిష్టతతో వీటి స్థాపన లక్ష్యం నెరవేరలేదు. నిర్వ హణ ఖర్చులకు నిధులు లేక అరకొర వసతులతో కనీస సౌకర్యాలు లేక సమ స్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న పట్టించుకే దిక్కే కరువైంది. అనునిత్యం పనులకోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. కనీసం తాగునీరు మలమూత్రాలు చేయుటకు గదులులేక వాహనాలకు పార్కింగ్ స్థలం లేక వేచిఉం డడానికి కూర్చిలు లేక నరకం అనుభవిస్తూ నిలబడి పనులు చేయించుకొని వెళ్తున్నారనే ఆరోపణలు వినిపిస్తు న్నాయి. ఊరి మధ్యలో ఇరుకు సందుల్లో అద్దెభవనంలో ఎంపిడివో కార్యాల యం ఏర్పాటు చేయడంతో మాకెన్నాళ్లు ఈ అవస్థలని ఆందోళన చెందుతు న్నారు. ఇరుకు రహదారులతో వచ్చిపోయే వాహ నాలతో కార్యాలయానికి వచ్చే అధికారులు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి నిందిగామ లో ఎంపిడివో తహసీల్దార్ కార్యాలయాలను సత్వరమే నిర్మాణాలు చేపట్టి అధికా రుల కార్యాలయ సిబ్బంది ప్రజల ఇబ్బందులను తొలగించాలని గ్రామీణులు కార్యాలయ సిబ్బంది మొరపెట్టుకుట్టున్నారు.


నందిగామలో ఇళ్ల మధ్య ఉన్న ఎంపిడివో కార్యాలయం


పాతజాతీయ రహదారిపై అద్దెభవనంలో తహసీల్దార్ కార్యాలయం


శివాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ ప్రజాప్రతినిధులు

## శివాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ ఎంపి, మాజీ ఎమ్మెల్యే

**బెజ్జంకి, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త :** మండల పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాశిలింగేశ్వర స్వామి అలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్టాపనలో మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా అలయ కమిటీ సభ్యులు, అర్చకులు వారిని శాలువాతో సత్కరిం చారు. కార్యక్రమంలో ఎంపిపి లింగాల నిర్మల, పార్టీ మండల అధ్యక్షులు పాకాల మహిపాల్‌రెడ్డి, నాయకులు లక్ష్మన్, తిరుపతి, తిరుపతిరెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

## గ్రామస్థుల నిరసనకు ధర్మ సమాజ్ పార్టీ మద్దతు


కర్మాగారం చేపట్టిన స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

**బెజ్జంకి, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త :** మండల పరిధిలోని పోతారం, గుగ్గిళ్ల గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న ఇథనాల్ కర్మగారాన్ని నిలిపివేయా లని ఇరు గ్రామాల ప్రజలు చేస్తున్న నిరసనకు గురువారం డీఎస్పీ పార్టీ మద్దతు తెలిపింది. ఈ మేరకు గురువారం ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి అన్నేల లక్ష్మణ్, జిల్లా అధ్యక్షులు కర్రోల్ల రవిబాబులు ఇథనాల్ కర్మగారం చేపట్టే స్థలాన్ని పరిశీలించి గ్రామస్థులతో మాట్లాడి వారికి మద్దతు తెలిపారు. ఇథ నాల్ కర్మగారం ఏర్పాటుచేస్తే భూగర్భ జలాలతోపాటు మానవాళికి ముప్పు వాటిల్లుతుందని వెంటనే సంబంధిత అధికారులు, ప్రజల శ్రేయస్సు మేరకు ఇథనాల్ కర్మగారం అనుమతులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, మండల నాయకులు లింగాల విజయ్, లింగాల సురేష్, మహరాజ్ ధర్మ స్టూడెంట్స్ యూనియన్ ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి తదితరులు పాల్గొన్నారు.

## వరి పంటను పరిశీలించిన అధికారులు


వరి పంటను పరిశీలిస్తున న్న వ్యవసాయ అధికారులు

**మిరుదొడ్డి, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త :** మండల పరిధిలోని లింగు పల్లిలో గురువారం మండల వ్యవసాయ అధికారి బోనాల మల్లేశం వరి పంట పొలాలను పరిశీలించారు. వరిలో కాండం తొలుచు పురుగు అధికం గా ఉండడం వలన రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పిలక దశలో ఉన్న వరి పైరుకు ఎకరాకు కార్బోఫ్యూరాన్ 3 జి, గుళికలు 10 కిలోలు లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4 జి గుళికలు 8 కిలోలు చల్లుకోవాలన్నారు. చిరు పుట్ట దశలో పురుగు ఉధృతి గమనించినట్లయితే కర్టప్ హై డ్రోక్లోరైడ్ 50 శాతం ఎస్పీ 2 జిఆర్ లీటర్ లేదా క్లోరంట్రా నిలిప్రోల్ 0.3 ఎంఎల్ లేదా ఇసోసైక్లో సిరం 0.6 ఎంఎల్ ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. వరిలో గంధక ప్రభావం వలన వేర్లు కుల్లి వాసన రావడం జరుగుతుందని నివారణకు హెక్సాకొనాజోల్ లేదా కాపర్ అక్సిక్లోరైడ్ మందులను వినియోగించాలన్నారు.

## ప్రజలు మూఢనమ్మకాలను వీడాలి : ఎస్ఐ


మాట్లాడుతున్న ఎస్ఐ తాండ్ర వివేక్

**అక్కన్నపేట, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త :** ప్రజలు మూడనమ్మకాలను వీడాలని ఎస్ఐ తాండ్ర వివేక్ అన్నారు. బుధవారం రాత్రి అక్కన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చౌటపల్లి గ్రామంలో కనువిప్పు కార్యక్రమాన్ని సంస్కృతిక సారధి టీమ్‌తో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ మూడనమ్మకాలు, మంత్రాలు, తంత్రాలు, సామాజిక రుగ్మతలతో పాటు సైబర్ నేరాలు,హెల్మెట్ వినియోగంల గురించి ఎల్ఈడి స్క్రీన్‌పై చూపిస్తూ ప్రజలు అవగాహన కల్పించారు.అంతే కాకుండా సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.జిల్లాలో పిల్లలను ఎత్తుకుపోయే దొంగలు వచ్చారని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న పుకార్లు నమ్మవద్దని,పుకార్లు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లాలో ఇప్పటి వరకు పిల్లల్ని ఎత్తుకు పోయో ముటాలు లేవన్నారు.గ్రామాలలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే 100, 8712667100 నంబర్లు లేదా నేరుగా పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించవచ్చన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

## ఘనంగా సైన్స్ డే సంబరాలు

**చేర్యాల, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త :** చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం తెలంగాణ అకాడమి ఆఫ్ సైన్స్ ఆధ్వర్యంలో సైన్స్‌డే సంబరాలను ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా 50 ఎగ్జిబిట్స్ ప్రకటించారు. అలాగే మైండ్ షో మ్యాజిక్ మూడనమ్మకాలపై విద్యార్థులచే ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ అయోధ్యరెడ్డి, డా. మధు సూదన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఐలయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

## ప్రజల సేవే పరమావధి : జడ్పిటిసి

**మేడ్చల్, ఫిబ్రవరి 29. ప్రభాతవార్త :** ప్రజలకు అన్ని విదాల సేవ చేసి, వారి బాగోగుల కోసం నిరంతరం కృషి చేయడమే తమ కర్తవ్య మని మేడ్చల్ జడ్పిటిసి శైలజ విజయనందరెడ్డి అన్నారు. మేడ్చల్ మండలంలోని శ్రీరంగవరం గ్రామంలో గ్రామ మాజీ సర్పంచ్ విజయ నందరెడ్డితో పాటు ఆమె స్వంత డబ్బులు వెచ్చించి నిర్మిస్తున్న ముది రాజ్ సంఘం భవణ నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనమై నమ్మకంతో ఓటు వేసి గెలిపించి ప్రజా సేవ చేసుకుని భాగ్యం కల్పిం చిన ప్రజలకు అన్ని విదాల అండగా ఉండడమే తమ కర్తవ్యమని అన్నారు. మండలం లోని గ్రామాల అభివృద్దికి తన వంతు సహకారం అందిస్తున్నామని తెలిపారు. శ్రీరంగవరం గ్రామంలో స్వంత నిధులు వెచ్చించి ముది రాజ్ సంఘం భవణాన్ని నిర్మిస్తున్నామని, భవిష్యత్‌లో కూడ తమ వంతు సహకారం అందించేందుకు పాటుపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ విజయనందరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ నర్సింహ, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నారాయణ ముది రాజ్, రాములు, యాదయ్య గౌడ్, బాలేష్ ముదిరాజ్, శంకర్ ముదిరాజ్, ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం!

### మేకగూడ తాజా మాజీ సర్పంచ్ పాండురంగారెడ్డి

**నందిగామ, ఫిబ్రవరి 29. ప్రభాతవార్త :** మారుతున్న నేటి ఆధునిక సమాజంలో యోగా ధ్యాన్యం ప్రాణాయామం ద్వారా మానసిక ప్రశాం తత తోపాటు సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని నందిగామ మండ లం మేకగూడ తాజా మాజీ సర్పంచ్ పాండురంగారెడ్డి అభిప్రాయ పడ్డారు. పర్యావరణం పూర్తిగా పాడైందని పిల్చేగాలి తాగేనీరు విష పూరితమైం దన్నారు. యోగా దినచర్యలో భాగంగా పాదురంగారెడ్డి యోగా ఆసనాలు చేస్తూ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఆసనాలు చేయడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని పెంచడమే కాకుండా శరీరంలో ఉన్న కండరాలను శక్తివంతం చేస్తాయన్నారు. గుండె సంబంధిత కండరాలు సరైన పద్ధతిలో కొట్టుకోవడమే కాకుండా రక్త ప్రసరణ మెరుగుపడి గుండె పోటు గుండె ఇంతర అవయవాలకు సంబంధించిన జబ్బులు దూరమవుతాయని పేర్కొన్నారు.

## జడ్పీ నిధులతో బోరు ప్రారంభం : ఎంపీపీ

**కోట్‌పల్లి, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త;** ప్రజల అవసారలను గుర్తించి రూ.4 లక్షలతో రెండు వేరువేరు చోట బోరు మంజూరు చేసిన వికారాబాద్ జిల్లాపరిషత్ చైర్మన్ సునీత మహేందర్‌రెడ్డి కోట్‌పల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో బస్టాండ్ మరియు స్మశాన వాటిక అవరణలో ఇటీవల బోరు వేయడం జరిగింది. వేసవి కాలంలో రావడంతో ప్రజలకు నీటి ఎద్దడి ఎక్కువ అవ్వడంతో గురు వారం నాడు ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి బోరు మోటర్స్ బిగించి పారంభిం చారు. ఈ సందర్బంగా రాంపూర్ గ్రామ ప్రజలు జిల్లా పరిషత్ చైర్మన్ సునీత మహేందర్‌రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో రాంపూర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నాయకులు రాజు, బల్వంతు, నర్సిములు, తదితరులు పాల్గొన్నారు,

## అంగన్‌వాడీ భవనాలు నిర్మించాలి

**తలకొండపల్లి, ఫిబ్రవరి 29 ప్రభాతవార్త :** తలకొండపల్లి మండలం లోని హర్యానాయక్ తండా గ్రామ పంచాయతీ పరధిలోని సూర్యానా యక్ తండా లక్ష్మీతండా గ్రామాలలో అంగన్‌వాడీ భవనాలు లేక చిన్నారులు అనే ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం పట్ల గురు వారం గిరిజన ఐక్య వేదిక కో ఆర్డినేటర్ కొర్ర కృష్ణనాయక్ ఆధ్వ ర్యంలో గిరిజన యువకులతో కలిసి స్థానిక ఎంపిడివో శ్రీకాం త్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణనాయక్ మాట్లా దుతూ మండలంలోని హర్యానాయక్ తండా గ్రామపంచాయతీలోని సూర్య నాయక్ తండా లక్ష్మీతండాలలో అంగన్‌వాడీ టీచర్లు ఆయా లు కేటాయించి భవనం మాత్రం లేకపోవడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్ర భవనాలు మంజూ రు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎంపిడివోకు వినతి ప్రతం అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఐక్యవేధిక కోఆర్డినే టర్ కొర్ర కృష్ణ, కుమార్, నరసింహ, భాస్కర్, రవి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌లు అప్పగింత

**ధారూర్, ఫిబ్రవరి 29. ప్రభాతవార్త :** సెల్‌ఫోన్ పోగొట్టుకుపోయిన, దొంగిలించిన ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సిఈఐఆర్ ఫిర్యాదుతో పట్టుకోవచ్చని ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్ అన్నారు. మం డల కే ంద్రానికి చెందిన చాకలి నరసింహులు గత ఆరు నెలల క్రితం కుమ్మరి పిచ్చయ్య ఫిబ్రవరి 12న మార్కెట్ యార్డులో మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నారు. దీంతి సీఈఐఆర్ పోర్టల్‌లో బాధితుడు ఫిర్యాదు చేయగా సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా పోగొట్టుకున్న సెల్ ఫోన్‌లను గురి ంచి స్వాధీనం చేసుకుని గురువారం బాధితులకు సెల్‌ఫోన్లను ఎస్ఐ అందించినట్లు తెలిపారు. ఎవరైనా వారి ఫోన్ పోగొట్టుకున్నా, దింగతనానికి గురైనా అట్టి ఫోన్ వివరాలను సిఈ ఐఆర్‌లో నమోదు చేయాలన్నారు.

## నూతన రేషన్‌కార్డులు మంజూరు చేయాలి

**హుస్నాబాద్, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త :**
రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసే అన్ని సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు కీలకం గా మారిన నేపథ్యంలో రాష్ట్రంలో రేషన్‌కార్డులు లేని అర్హులందరికి ప్రభుత్వం వెంటనే రేషన్‌కార్డులు మంజూరుచేయాలని బిసి సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈసంపల్లి తిరుపతి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.కార్డు లేని వారం దరికి కార్డులు మంజూరు చేసి వారికి సంక్షేమ పథకాలు అందించాలని కోరారు.

## మానవత్వం చాటుకున్న ఎస్సై స్రవంతి

**కోట్‌పల్లి,ఫిబ్రవరి 29, ప్రభాతవార్త;** రెండు బైకులు ఢీకుని ఒక యువకు డికి మహిళకు గాయాలైన సంఘటన కోట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోట్‌పల్లి బిడ్జి సమీపంలో రెండు బైకులు ఢీకుని ఒక యువకుడు మహిళలకు గాయాలుయ్యాయి. దీంతో అదే దారిలో వస్తున్న స్థానిక ఎస్సై స్రవంతి మానవతా దృక్ప థంతో తన వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి గాయాలైన వారిని దగ్గర లోని ఆసుపత్రికి తరలించడం జరిగింది. గాయపడ్డ వారు సల్బ్ త్తాపూ ర్ గ్రామానికి చెందిన వారు జిడిగింజల యాదయ్య, మరియు తల్లి కోట్‌పల్లి నుండి సల్బ్‌త్తాపూర్ వెళ్తూన్నాడు ఎదురుగా వస్తున్న బైకు ఎన్కెపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి అన్నసాగర్ నుంచికోట్‌పల్లి వస్తూ రాంగ్‌రూట్‌లో వచ్చి బైకును డికోట్టాడు. దీంతో సల్బ్‌త్తాపూర్ గ్రామా నికి చెందిన యువకుడికి మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో హుటహుటిన పోలీసు వాహనంలో ఆసుపత్రికి తరలించడం జరిగిం దని ఇంత వరకు ఏవరు పిర్యాదు చేయలేదని ఎస్సై స్రవంతి పేర్కొ న్నారు,

### ఎస్సై స్రవంతికి మండల వాసులు హర్షం

ఎస్సై స్రవంతి తన కుమారుడు జ్వరంతో ఉన్నడని రూంకి వెళ్తూ ఈ ఘటన జరగటంతో వెంటనే కుమారుని బైక్‌పై ఇంటికి పంపించి తన పోలీసు వాహనంలో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. దీంతో ఎస్సై స్రవంతి మానవత్వం చాటుకోవడంతో మండల వాసులు హర్షం వ్యక్తం చేశారు.

## గ్రామాల్లో నీటిఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

### ఎంపిడిఓ సరిత అధికారులకు సూచన

**కందుకూరు, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త:** వచ్చే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామాలలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా జాగ్ర త్తలు తీసుకో వాలని ఎంపిడిఓ సరిత అధికారుకు సూచించారు. గురు వారం మండల కేంద్రలో మిషన్‌భగీరథ డిఇ జగన్మోహన్‌రెడ్డి వారి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో గ్రామాలలో తాగునీటి పరిస్థి తుల పై సమీక్షాసమావేశాన్ని నిర్వహించారు. గ్రామాలలో ప్రజా పాల న లేకపోవడం వలన పంచాయతీ కార్యదర్శులు మిషన్‌భగీరథ అధికా రులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మండల పరిదిలో 35 గ్రామపంచాయతీలు ఉండగా అయా గ్రామాలలో జనాబా ప్రాతిపదికన సరఫరా అవుతున్న నీటి లభ్యతను ఎప్పటికప్పుడు సమీక్షించు కోవాలన్నారు. నీటి వృధాను అరికట్టాలని అవసరమైతే అందు బాటులో ఉన్న నీటి వనరులను ఉపయోగించు కోవాలన్నారు. గ్రామాలలో ఏర్పాటు చేసిన కులాయిలకు మిషన్ భగీరథ వారు ఏర్పాటు చేసిన కనక్షన్ల వద్ద చెర్రాలను పరిశీలించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపట్ల కటినంగా వ్యవహరించాలని సూచించారు.కార్యక్రమంలో మిషన్ భగీరథ గ్రిడ్ ఎఇఇ అరుణ్, గ్రామాల పంచాయతీ కార్యర్శులు పాల్గొన్నారు.

## యంజిఎన్‌ఆర్ఇ జిఎస్ పనులను పరిశీలించిన డిఆర్‌డిఓ

**కందుకూరు, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త:** గ్రామాలలో యంజిఎన్అ ర్ఇజిఎస్ ద్వారా చేపడుతున్న పనులు లక్ష్యాలను చేరేవిదంగా చర్యలు తీసుకోవాలని పని ప్రదేశంలో కూలీలకు వసతి సౌకర్యాలు సమకూ ర్చాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిని (డిఆర్‌డిఓ) శ్రీలత సూచిం చారు. గురువారం మండల పరిదిలోని బేగంపేట గ్రామంలో ఎన్అర్ఇ జిఎస్ ద్వారా అమలు జరుగుతున్న పనులను, నర్సరీని పరిశీలిం చారు. ఉపాది కూలీలతో మాట్లాడి వివిద అంశాలపైన అరా తీశారు. ఈ సందర్బంగా డిఆర్‌డిఓ శ్రీలత మాట్లాడుతు ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కూలీలకు పనిచేసే ప్రదేశంలో నీటి వసతి కల్పించాలని ఒఆర్ఎస్ పాకెట్లు, అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అర్హత ఉన్న ప్రతి కూలీకి నిర్దేశించిన పనిదినాలు పనికల్పించాలని లక్ష్యాలను చేరుకునేలా చూడాలన్నారు. రాబోయే వార్షా కాలం నాటికి హరిత హరం కార్యక్రమంలో బాగంగా ఏర్పాటు చేసిన నర్సరీలతో లక్ష్యానిక నుగునంగా మొక్కలను పెంచాలని అందులో నీడనిచ్చే మొక్కలకు ప్రాదాన్యత ఇవ్వాలని ఇండ్ల వద్దపెంచే పండ్ల, పూల మొక్కలను అవుసరానికనుగునంగా అభివృద్ధి చేయాలన్నారు. నర్సరీలలో పెంచు తున్న మొక్కలు గ్యాప్‌లేకుండా చూడాలని సూచించారు. ఎపిడి సక్రియానాయక్, ఎంపిడిఓ సరిత, పంచాయతీ కార్యదర్శి సెల్వమని, ఇజిఎస్ ఇసి, టిఎ, మేట్ లు ఉపాదికూలీలు పాల్గొన్నారు.

## చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పట్నం సునీతారెడ్డి

### కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించడంతో నూతనోత్సహంలో శ్రేణులు
### బిజెపి అంటే ఇష్టం కాని అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిపైనే అయిష్టం

**చేవెళ్ళ, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త**
చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థిగా పట్నం సునీతారెడ్డిని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ప్రక టించింది. వికారాబాద్ జడ్పీ చైర్మన్ పట్నం సునీతా రెడ్డిని చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటిం చడంతో అభిమానుల్లో నూతనోత్సం నెలకొంది. చేవెళ్లలో నిర్వహించిన జన జాతర సభలో పట్నం సునీతారె డ్డికి సిఎం రేవంత్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. బహిరంగ సభలో ముందుకు రావాలని పలుమార్లు పట్నం సునితారెడ్డికి సిఎం రేవంత్‌రెడ్డి దారి చూపారు. చేవెళ్ల పార్లమెంట్‌కు పోటీకి అభ్య ర్థులు చాలా మంది పోటి పడ్డారు. పార్టీ అధిష్టానం పట్నం సునీతారెడ్డికి పట్టం కట్టింది. ఉమ్మడి రంగా రెడ్డి జిల్లాకు పట్నం సునీతారెడ్డి సుపరిచితురాలు కావడంతో గెలుపు ఖాయమని బావిస్తున్నారు.చేవెళ్ల పార్లమెం ట్‌కు మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మా రెడ్డి పోటీ పడ్డారు. సిఎం రేవంత్‌రెడ్డి మాత్రం పట్నం సునీతారెడ్డివైపు మొగ్గుచూపారు. జన జాతర సభను విజయవంతం చేయడంలో పట్నం కుటంబం పూర్తిగా విజయవతం అయ్యింది. పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల్లోని ప్రతి గ్రామంలోని ప్రజలను సునీతారెడ్డికి పరిచయంతో పాటు ప్రతి గ్రామానికి నిధులు మంజూరు చేసి అభివృద్ధిలో తన మార్కును ముద్ర వేసుకున్నారు. జనం మెచ్చిన నెత సునితారెడ్డి ఖావడంతో అధిష్టానం కూడ అమె వైపు మొగ్గ చూ పింది. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో బిజెపికి మంచి నాయకులు కార్యకర్తలున్నారు. బిజెపి వైపు యువత ఎక్కువగా ఆసక్తిని చూపిస్తున్నారు. దీంతో బిజెపి బలంగా ఉంది కాని ఎంపి అభ్యర్థి కోండ విశ్వే శ్వర్‌రెడ్డిపైనే నేతలతో పాటు జనం కూడ అ ఇష్టం వ్యక్తం చేస్తున్నారు.మాజీ ఎంపి కోండ విశ్వేశ్వర్‌రెడ్డి వ్యక్తి గతంగా మంచి వ్యక్తినే కాని రాజకీయంగా మా త్రం అసమర్ధుడన్న విమర్శలు వినిపిస్తున్నారు.

గతం లో చేవెళ్ల ఎంపిగా ఐదు సంవత్సాలు పని చేసి చేవెళ్లకు చిరస్థాయిగా నిలిచిపోయి ఉండే విధంగా ఎం పని చేశారన్న విమర్శలు కూడ ఉన్నాయి. ఎంపిగి పని చేసిన కాలంలో బోటింగ్ చేయడం, ప్రభుత్వ పాఠశాలల్లో బాత్ రూంలను క్లీన్ చేచడం తప్ప ప్రజ లకు ఉపయోగపడే పని కోసం నిధులు మంజూరు చేయించలేదన్న ఆరోపణలున్నాయి. ఎంపి రంజీ త్‌రెడ్డి తన పదవి కాలంలో చేవెళ్ల జనంకు ఉపయో గపడే పనులు చేశారన్న పెరు ఉంది.పార్లమెంట్ పరిధిలో ఎంపి రంజీత్‌రెడ్డి చేసిన పనులు దర్శనమి స్తుంటాయి. చేవెళ్ల కాంగ్రెస్ కంచుకోటను మల్లీ దక్కించుకనేందుకు కాంగ్రెస్ నాయకులు ఉత్సాహం చూపిస్తున్నారు.


ఎంపిడివో గిరిధర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మీరెడ్డి

## ఎంపిడివోకు ఘనంగా వీడ్కోలు

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 29,ప్రభాతవార్త:** ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి గురు వారం పదవీ విరమణ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ భాగ్య లక్ష్మీరెడ్డి కార్యాలయ సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. ఎంపీపీ భాగ్యలక్ష్మీరెడ్డి మాట్లాడుతూ గత నాలుగున్నర సంవత్సరాలుగా మండల కేంద్రంలో ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్నారని, సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశారని, రేపటి నుండి ఆయన సేవలు బాధాకరమన్నారు. 32 సంవత్సరాలుగా వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేస్తూ పదోన్నతులు పొందానని, చిన్నశంకరం పేట మండల ఎంపీవోగా స్వచ్ఛంధ పదవీరమణ తిసుకుంటానని, ప్రజలకు మేలు చేసిన తృప్తి ఎల్లప్పుడు ఉంటుందని గిరిధర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మన్నన్, సూపరింటెం డెంట్ అశోక్, గోపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## విద్యుత్ రంగ సంస్థను అభివృద్ధి చేసుకుందాం

### తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్


నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త :** అందరం సమిష్టిగా పని చేసి విద్యుత్ రంగ సంస్థను మరింత అభివృద్ధి చేసుకుందామని తెలంగాణ ఎలక్ట్రిసిటి ఎంప్లాయిస్ యూనియన్ 1104 జిల్లా అధ్యక్షులు రాంమోహన్, జిల్లా కార్యదర్శి ఏ.వీరభద్రయ్యలు అన్నారు. తెలంగాణ ఎలక్ట్రిసిటి ఎంప్లా యిస్ యూనియన్ 1104 సిద్దిపేట డివిజన్ సర్వసభ్య సమావేశం గురు వారం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడారు. విద్యుత్ వినియోగదారులకు మంచి సేవలను అందిస్తూ వారితో మర్యాదమెదులుదా మన్నారు. విద్యుత్ కార్మికులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారా నికి కృషి చేస్తామన్నారు. జిల్లా సర్వసభ్య సమావేశం ఈనెల 2న గజ్వేల్ డివిజన్‌లో నిర్వహించడం జరుగుతుందన్నారు. సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్ డివిజన్‌ల నుంచి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల న్నారు. కాగా సిద్దిపేట డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకట్లు తెలిపారు. డివిజన్ అధ్యక్షులుగా జె.రామకిష్టయ్య, కార్యనిర్వాహణ అధ్యక్షు లుగా ఎం.డి. వజీరుద్దీన్, డివిజన్ కార్యదర్శిగా కె.శ్రీశైలం, అదనపు కార్య దర్శిగా ఎం.ప్రవీణ్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. డివిజన్ నూనత కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందులకు జిల్లా అధ్యక్ష, కార్యద ర్శ లు రాంమోహన్, వీరభద్రయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

## మున్సిపల్ చైర్మన్‌ను కలిసిన టిఎన్జీవోస్ నాయకులు

**నర్సాపూర్, ఫిబ్రవరి 29.ప్రభాతవార్త:** నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్‌ను గురువారం టిఎన్జీవోస్ యూనియన్ మెదక్ జిల్లా నర్సాపూర్ యూనిట్ ప్రసిడెంట్ శేషాచారి జనరల్ సెక్రటరీ రాకేశ్‌తో పాటు యూనియన్ సభ్యులు చెన్నయ్య, కృష్ణ, సంగమేశ్వర్ మున్సిపాలిటీ కార్యా లయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు టిఎన్జీవోస్ నూతన క్యాలెండర్ ను, డైరిని అందజేయడం జరిగింది. ఈసందర్బంగా వారు మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ కు శుబాకాంక్షలు తెలియజేశారు.

### దోభీఘాట్, శ్మశానవాటిక నిర్మాణ పనులను పరిశీలన...

**నర్సాపూర్, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త:** నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధి లోని 2 వార్డులోని దోభీఘాట్, హిందూ శ్మశానవాటిక నిర్మాణ పనులను గురువారం మున్సిపల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా అశోక్‌గౌడ్ మాట్లాడుతూ దోభీఘాట్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అంతేగాక హిందూ శ్మశానవాటికలో జరుగుతున్న పనులను పరిశీలించి అక్కడ అడ్డంగాఉన్న చెట్లను తీసివేయాలని మున్సిపల్ సిబ్బందిని ఆయన ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఆటంకం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పంబళ్ళ బిక్షపతి, కౌన్సిలర్ రాంచందర్, నాయకులు కుమ్మరి నాగేశ్, ఆంజనేయులుగౌడ్, వార్డు సభ్యులు నరేందర్‌చారి, మున్సిఫల్ శానిటెరి ఇన్స్ పెక్టర్ సల్లమురళీ,ఎల్లం, మున్సిఫల్ సిబ్బంది పాల్గొన్నారు.

## బేటి బచావో, బేటి పడావో కార్యక్రమంపై అవగాహన


బేటి బచావో,బేటి పడావో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**నర్సాపూర్ రూరల్, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త:** మహిళా శిశు సంక్షేమ శాఖ మెదక్ జిల్లా డిస్ట్రిక్ ఫర్ హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్‌లో భాగంగా గురువారం మండల పరిధి నారాయణపూర్‌లోని టిటిడబ్ల్యూ ఆర్జేసీ స్కూల్‌లో బెటి బచావో, బేటి పడావో కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు బేటి బచావో,బేటి పడావో సర్వీసెస్ అండ్ సెఫ్ టచ్,ఆన్ సేఫ్ టచ్, చైల్డ్ మ్యారేజెస్, చైల్డ్ లైన్ ఉమెన్ హెల్ప్ లైన్ నంబర్ల గురించి చెప్పారు. లైఫ్ స్కిల్స్, మెంటల్ హెల్త్‌పై విద్యార్థులకు శ్రీమతి కొరపాటి సునీత రాకేష్, రిసోర్స్ పర్సన్ సెషన్లను కండక్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శ్రీచైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త :** సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలోని రంగాధంపల్లి బ్రాంచ్ శ్రీచైతన్య రెసిడెన్షియల్ హాస్టల్స్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి కొండలవాడి సతీష్, నియోజకవర్గం అధ్యక్షులు బడేకోల్ రాకేష్ యాదవ్ మాట్లాడుతూ ఎలాంటి భద్రత నియమాలు లేకుండా పాఠశాలను నడిపిస్తూ అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారని అరోపించారు. హాస్టల్ లో విద్యార్థులకు నాణ్యమైన అహారం అందించడం లేదన్నారు. చెరువు పక్కన ఎఫ్‌టిఎల్‌లో స్థలంలో నిర్మించిన భవనంలో పాఠశాలను నడుపుతూ భవనానికి ఎలాంటి భద్రత నియమాలు లేవన్నారు. ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల జీవితాలతో అడుకుంటున్నారని అరోపించారు. పాఠశాలపై చర్యలు తీసుకోవాలని లేనియెడల ఎన్ఎస్‌యుఐ అధ్వర్యంలో ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ నాయకులు మొగిలి రాకేష్, సాజిద్, సన్ని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో వినతి పత్రం అందిస్తున్న ఎన్ఎస్‌యుఐ నాయకులు



నాగల్‌గిద్ద నుంచి విజయసంకల్ప యాత్రకు తరలుతున్న బిజెపి శ్రేణులు

## విజయసంకల్ప యాత్రకు బిజెపి శ్రేణులు

**నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త:** మండల కేంద్రం నుంచి భారతీయ జనతా పార్టీ నిర్వహిస్తున్న విజయ సంకల్ప యాత్రకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. నియోజకవర్గ కేంద్రమైన నారాయణఖేడ్‌లో నిర్వహించే విజయ సంకల్ప యాత్రకు ఆయా గ్రామాల నాయకులు నాగల్‌గిద్దకు చేరుకుని మోదీకి అనుకూలంగా నినాదాలు చేస్తూ తరలివెళ్లారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు రాజశేఖర్ పాటిల్, నాయకులు సిద్ధయ్యస్వామి, గుణవంత్, ప్రకాశ్ పాటిల్, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు పోలియోపై అవగాహన




మాట్లాడుతున్న డాక్టర్ శశికర్

**సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త:** మార్చి 3న నిర్వహించే జాతీయ పోలియో నివారణ కార్యక్రమంలో పాల్గొనే ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం పట్టణంలోని తారా కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశం తెలిపారు. కార్యక్రమనికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టరనశశికర్ మాట్లాడుతూ చిన్నారులకు విధిగా చుక్కలు వేయించి పోలియో వ్యాధి రాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం తల్లిదండ్రులపై ఉందన్నారు. జిల్లాలోని ప్రతి కూడలి వద్ద మార్చి 3న పోలియో చుక్కలు వేసేందుకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. కళాశాలకు చెందిన 150 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్వచ్ఛందంగా సేవలు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. పోలియో చుక్కలు వేసే తీరుపై వలంటీర్లకు అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ వెంకటేశం, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ పద్మజ, వైద్య సిబ్బంది అరుంధతి, ఎలిజబెత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి అకాడమి చైర్మన్ భరోసా



శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న జిల్లా యూనియన్ నాయకులు

**సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త:** జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి భరోసా ఇచ్చారని టీయుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు బి.యాదగిరి అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లోని ప్రెస్ క్లబ్‌లో అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకుని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు యాదగిరి మాట్లాడుతూ గ్రామీణ జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు పొందేలా శ్రీనివాస్‌రెడ్డి చేసిన కృషిని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. శ్రీనివాస్‌రెడ్డిని చైర్మన్‌గా నియమించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి యాదగిరి కృతజ్ఞతలు తెలిపారు.

## నాగల్‌గిద్దలో విద్యార్థుల స్వయం పాలన



నాగల్‌గిద్ద ప్రాథమిక పాఠశాలలో స్వయం పాలన జరుపుకుంటున్న విద్యార్థులు

**నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. తోటి విద్యార్థులకు ఉపాధ్యాయులైన విద్యార్థులు పాఠాలు బోధించారు. డిఈఓగా శృతి, ఎంఈఓగా ప్రదీప్, ప్రధానోపాధ్యాయులుగా చందులు వ్యవహరించారు. కార్యక్రమంలో టిపిటిఎఫ్ కౌన్సిలర్ రమేష్, ప్రధానోపాధ్యాయులు సర్దార్, ఉపాధ్యాయులు భవాని, శ్వేత పాల్గొన్నారు.

## కరస్‌గుత్తిలో ఘనంగా మహాపడిపూజ

**నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త:** మండలంలోని కరస్‌గుత్తిలో గురువారం శివస్వాములు మహా పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని పాండురంగస్వామి ఆలయంలో నిర్వహించిన మహా పడి పూజ కార్యక్రమంలో ద్వాదశ 12 జ్యోతిర్లింగాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో శివనామ స్మరణతో మార్మోగింది. ఈ సందర్భంగా మోహన్‌జ్యోషి ప్రవచనాలు చేశారు. పూజా కార్యక్రమాలకు చేరుకున్న భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## పిహెచ్‌సిని పరిశీలించిన తహసీల్దార్

**కంగ్టి, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం తహసీల్దార్ విష్ణుసాగర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై పిహెచ్‌సి డాక్టర్ నాగమణిని అడిగి తెలుసుకున్నారు. వైరల్‌ఫీవర్ ప్రజలకు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని, వ్యాధిపట్ల అవగహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆసుపత్రికి సిబ్బంది సక్రమంగా విధులకు హాజరయ్యేలా చూడాలని డాక్టర్‌కు సూచించారు. ఆసుపత్రిలోని వసతులను తహసీల్దార్ ప్రత్యక్షంగా పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలపై రోగులతో తహసీల్దార్ ఆరా తీశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్ నాగమణికి సూచించారు.



ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ విష్ణుసాగర్

# పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి గెలుపు ఖాయం

### కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి



మాట్లాడుతున్న వెంకటరమణరెడ్డి

**మనూర్, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త:** రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ 400 స్థానాలను కైవశం చేసుకోవడం ఖాయమని, మూడోమారు నరేంద్ర మోడీ ప్రధాన మంత్రి కావడం తధ్యమని కామారెడ్డి ఎమ్మెల్యే, జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జి వెంకట రమణ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రమైన మనూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి విజయపాల్‌రెడ్డి, డిసిసిబి మాజీ చైర్మన్ ఎం.జైపాల్‌రెడ్డి, నాయకులు సంగప్పతో కలిసి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు బలహీన వర్గాల కుటుంబాల్లో ప్రతి ఒక్కరికి ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ స్థానంపై ఈమారు బిజెపి జండా రెపరెపలాడటం తధ్యమన్నారు. ఎంపి బిబి పాటిల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేయించడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు. అభివృద్ధిని కాంక్షించే భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను పార్లమెంట్‌కు పంపాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు అంబర్‌సింగ్, రజినికాంత్, రామకృష్ణ, ఈశ్వరప్ప, అంజయ్య, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**భారీ బైక్ ర్యాలీతో వీడ్కోలు...**

విజయసంకల్పయాత్రలో భాగంగా జహీరాబాద్‌లో బుధవారం రాత్రికి నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి పాల్గొనడంతో కార్యక్రమంలో పాల్గొనేందుకు నారాయణఖేడ్ ప్రాంతం నుంచి పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. గురువారం జహీరాబాద్ నుంచి నారాయణఖేడ్‌లో నిర్వహిస్తున్న విజయ సంకల్ప యాత్రలో పాల్గొనేందుకు వెళుతున్న పార్టీ నాయకులను, ప్రజాప్రతినిధులను మనూర్‌లో నాయకులు ఘనంగా స్వాగతం పలికి నారాయణఖేడ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి స్వాగతం పలికారు.



సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎన్ఎస్‌యుఐ నేతలు

## సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం అన్న మాట తప్పకుండా 11 వేల మెగా డిఎస్సీ ఉద్యోగాలు నియామకం కోసం నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని డా॥బి.ఆర్.అంబేద్కర సర్కిల్ వద్ద సిఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కో-ఆర్డినేటర్, డీసీసీ ఓబీసీ సెల్ అధ్యక్షులు డా॥ లక్కరసు సూర్యచంద్ర వర్మలు మాట్లాడుతూ గత ప్రభుత్వం నిరుద్యోగులకు తీరని అన్యాయం చేస్తే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజాపాలనలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తుందన్నారు. సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా నిరుద్యోగ యువకులకు ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగాల భర్తీ ప్రక్రియ వేగవంతం చేస్తున్నారని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఆరు గ్యారెంటీలు సైతం ఖచ్చితంగా అమలు చేసి తీరుతారని తెలిపారు. మెగా డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడానికి ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఎంతో కృషి చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలలలోపే 11 వేలకు పైగా మెగా డిఎస్సీకి నోటిఫికేషన్ విడుదల చేయడంపట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ నాయకులు కొండల్వడి సతీష్, బడికోల్ రాకేష్‌యాదవ్, పిట్ల అర్జున్, మొగిలి రాకేష్, తరుణ్, సాజిద్, రమేష్, వెంకట్, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీ విడుదల హర్షణీయం : రమేష్‌గౌడ్

**పాపన్నపేట, ఫిబ్రవర 29, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెగా డిఎస్సీ ద్వారా 11,062 మంది ఉపాధ్యాయుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేయడం పట్ల మెదక్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం రమేష్‌గౌడ్ మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాలు అనే ప్రధాన డిమాండ్లతో అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ ప్రభుత్వం 9 సంవత్సరాల పాలనలో మెగా డిఎస్సీని ప్రకటించడానికి సహకరించలేదని విచారం వ్యక్తం చేశారు. ప్రజల కష్టాలు తెలిసిన రేవంత్‌రెడ్డి ప్రజా పాలన అందిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఇటీవలే పోలీసు ఉద్యోగాలు, గురుకుల ఉపాధ్యాయుల ఉద్యోగాలు నర్సింగ్ ఉద్యోగాలకు ఫలితాలు వెల్లడించిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 5089 పోస్టులను జరీ చేసిన పాత నోటిఫికేషన్ రద్దు చేస్తూ తాజాగా 11062 పోస్టులకు డీఎస్సీ విడుదల చేయడం నిరుద్యోగుల జీవితాలకు బరోసాగా ఉంటుందన్నారు. నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రమేష్ గౌడ్ సూచించారు.

## విజయవంతమైన ఉచిత వైద్యశిబిరం

**రామాయంపేట, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త :** రామాయంపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు బసన్నపల్లి మల్లేశం కుమార్తె వైష్ణవి పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతంగా ముగిసింది. హైదరాబాద్ మల్లారెడ్డి హాస్పిటల్ సహకారంతో గురువారం రామాయంపేట పట్టణంలోని దుర్గమ్మబస్తి, దుర్గమ్మ గుడి వద్ద ఏర్పాటుచేసిన ఉచితవైద్యశిబిరాన్ని స్థానిక ఎస్ఐ రంజిత్ చేతుల మీదుగా ప్రారంభించారు. బిపి, షుగర్‌తో పాటు ఇతర జబ్బులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంతా ఎస్ఐ రంజిత్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసిన బసన్నపల్లి మల్లేశంను, మల్లారెడ్డి ఆసుపత్రి వైద్య బృందాన్ని ఆయన అభినందించారు. ఆపరేషన్లు అవసరమైన వారికి మల్లారెడ్డి హాస్పిటల్ హైదరాబాద్‌లో ఉచితంగా చేయిస్తామని హాస్పిటల్ ప్రతినిధి మహమూద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యబృందం డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ రమ్య, సిబ్బంది నాగప్ప, సారిక, రేఖ, పార్వతి, ఎస్ఐ లింగారెడ్డి, స్థానిక కౌన్సిలర్ దేవుని జయరాజు, టియూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ సభ్యులు డి.జి. శ్రీనివాసశర్మ, ప్రముఖ సంఘ సేవకులు గట్టు ప్రశాంత్, కొడపర్తి నిరంజన్, పల్లె రాజు, జలగడుగుల నరేష్, దేవుని యాదేశ్, పోచమ్మల ప్రశాంత్(పండు), చల్మెడ శ్రీకాంత్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

### గురుకుల జూనియర్ లెక్చరర్ ఫలితాలలో గొడుగు స్రవంతి విజయం

**తొగుట, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త :** గురుకుల జూనియర్ లెక్చరర్ ఫలితాలలో తెలుగు సబ్జెక్ట్‌లో జూనియర్ లెక్చరర్‌గా మండల పరిధిలోని లింగంపేటకు చెందిన గొడుగు స్రవంతి విజయం సాధించారు. అన్ని అడ్డంకులను అధిగమించి జూనియర్ లెక్చరర్ ఫలితాలో ఉన్నతమైన ఉద్యోగాన్ని గొడుగు స్రవంతి సాధించడం పట్ల గ్రామస్తులు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## గౌరారంలో పౌరహక్కుల దినోత్సవం




పౌరహక్కులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఓ విజయలక్ష్మి

**వర్గల్, ఫిబ్రవరి 29 (ప్రభాతవార్త):** వర్గల్ మండలం గౌరారం గ్రామంలో గురువారం గ్రామ పంచాయతీ వద్ద పౌరహక్కుల దినోత్సవాన్ని ఎంపిడిఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు పౌర హక్కులపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ కులమతాలకు అతీతంగా కలిసి మెలసి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ శివకుమార్, ఏఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, పంచాయతీకార్యదర్శి శ్రీనివాస్, ఆర్ఐ నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ పూదరి కరుణాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మీడియా అకాడమి చైర్మన్‌కు శుభాకాంక్షలు



మీడియా అకాడమి చైర్మెన్ శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

**రామాయంపేట మున్సిపాలిటీ, (మెదక్) ఫిబ్రవరి 29, ప్రభాతవార్త :** తెలంగాణ మీడియా అకాడమీ చైర్మెన్‌గా కె. శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించగా మెదక్‌జిల్లా బృందం కలిసి శుభాకాంక్షలు తెలపడంజరిగింది. టియూడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాళ్‌చారి, ప్రధాన కార్యదర్శి ఎ.సంతోష్‌కుమార్, దాడుల వ్యతిరేక కమిటీ సభ్యులు కె. శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి సుమన్, నాయకులు సంగమేశ్వర్, సుధాకర్, నర్సింలు ఉన్నారు.

## జాతీయ రహదారిలో కోల్పోతున్న భూములకు నష్టపరిహారం పెంచండి...

**రామాయంపేట మున్సిపాలిటీ, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త :** జాతీయ రహదారి 765 డిజి ఏర్పాటులో భూములు కోల్పోతున్న రైతులకు, బాధితులకు నష్టపరిహారం పెంచాలని మండల పరిధిలోని అక్కన్నపేట గ్రామానికి చెందిన బాధితులు తహశీల్దార్ రజినికి వినతిపత్రం అందించారు. గురువారం వారంతా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని తహశీల్దార్‌కు తమ మొరను విన్నవించారు. జాతీయ రహదారి అభివృద్ధిచేయుటలో భాగంగా అక్కన్నపేట గ్రామంలో పంటలు పండుతున్న వ్యవసాయభూములతో పాటు నివాస గృహములు కూడా కోల్పోతున్నట్లు పేర్కొన్నారు. అందుకు ప్రభుత్వం చెల్లించు పరిహారం చాలా తక్కువగా ఉన్నదని, అట్టి పరిహారం తీసుకోవాడానికి తాము అంగీకరించడం లేదన్నారు. కావున తమకు చెల్లించు పరిహారం ప్రస్తుత బహిరంగ మార్కెట్ విలువకు రెండింతలు చెల్లించగలరని తమద్వారా కోరుతున్నామని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భూములు కోల్పోతున్న వి. నాగేందర్, ఇప్ప సిద్దరాములు, అక్కల చంద్రకళ, రాజు, బాలమణి, ఇ. లక్ష్మయ్య, బి.రాజు, శంకరయ్య, రాజయ్య, కె. సిద్దరాములు, బీరయ్య, రాగి యాదగిరి, రాగి మల్లవ్వ, సుభాష్, రామాగౌడ్ తదితరులు ఉన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన భూబాధితులు

# పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించే వరకు ఉద్యమం ఆగదు

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటి నరసింహా



ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆర్డీఓ కార్యాలయం మందు ధర్నా చేస్తున్న సిపిఐ నాయకులు

**జహీరాబాద్, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త:** పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించే వరకు ఉద్యమం ఆగదని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటి నరసింహ హెచ్చరించారు. గురువారం పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో పట్టణంలోని ఈద్గా ఎడ్లబజార్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ప్రజా నాట్యమండలి కళాకారులతో ఆటపాటలతో ఎర్ర జండాలు చేత బూని జాతీయ రహదారి గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయం ముందు నాయకులు ధర్నా నిర్వహించి కార్యాలయంలో వినతి పత్రం, 2500 ధరఖాస్తులను అందచేశారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ దశాబ్ద కాలం పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం అర్హులకు డబుల్ బెడ్ రూంలు కేటాయించడంలో సఫలీకృతులు కాలేక పోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హామీలను నిలుపుకోవాలని, అర్హులందరికి ఇండ్ల స్థలాలు కేటాయించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పలు గ్యారంటీలను అమలు చేయడం ఆనందంగా ఉందన్నారు. అర్హులందరికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని, లేకుంటే సిపిఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ స్థలాల్లో జండాలు పాతి స్థలాలను ఆక్రమించుకుంటామని హెచ్చరించారు. అర్హులైన వారి వివరాలను అధికారులకు, ప్రజాప్రతినిధులకు అందచేసినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ, సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్, జిల్లా నాయకులు అజారుద్దీన్, ఆనంద్, మహబూబ్ ఖాన్, అశోక్, రుబీనా బేగం, చిరంజీవి, సయ్యద్ తాజుద్దీన్, నర్సింలు, కాజా సయ్యద్, లతీఫ్, అసిన్, అజీజ్, అశ్వరాజు, శంకర్, షహీన్ బేగం, మధుమాల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులు నృత్యం చేస్తున్న దృశ్యం

## ఉన్నత శిఖారాలు చేరేలా విద్యార్థుల చదువులు సాగాలి

### అక్కాన్‌పల్లి జడ్పీహెచ్ఎస్ ప్రిన్సిపాల్ పెంచలయ్య

**జోగిపేట, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త:** విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకున్ననాడే గురువులకు సంతోషం కలుగుతుందని అక్కాన్‌పల్లి జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు పెంచలయ్య అన్నారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన ఫేర్‌వెల్ పార్టీలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకొని, అందుకు తగినట్లుగా కష్టపడాలన్నారు. మండలపరిధిలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఫేర్‌వెల్ పార్టీ ఘనంగా నిర్వహించారు. పదవ తరగతి విద్యార్థులు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్యంగా వారు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధుసూధన్‌రెడ్డి, నర్సింగ్, ప్రవీణ, సుధారాణి, లావణ్య, శ్రీధర్, లాయక్‌అలి పాల్గొన్నారు.

## మనూర్ పాఠశాలలో సిపిఆర్‌పై అవగాహన



మనూర్‌లో సిపిఆర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**మనూర్, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిపిఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హోప్ న్యూరో, కార్డియాక ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో సేఫ్ హార్ట్ కాంపెయిన్‌లో భాగంగా సిపిఆర్‌పై హోప్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమూర్తి సహకారంతో డాక్టర్ రాజేష్ చవాన్ ఆధ్వర్యంలో పాఠశాలలో విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ లక్ష మందికి అవగాహన కల్పించడమే ద్యేయంగా అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సిపిఆర్ ఎలా చేయాలని, పక్కవారికి స్ట్రోక్ వచ్చినప్పుడు సహాయం చేసే తీరుపై అవగాహన కల్పించారు. లక్ష మంది విద్యార్థులకు కల్పించే కార్యక్రమంలో భాగంగా గురువారం 241 మంది విఆయర్థులకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవీందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీశైలం తరలిన శివస్వాములు

**జోగిపేట, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త:** శివ దీక్ష చేపట్టిన శివస్వాములు గురువారంనాడు ప్రత్యేకపూజలు నిర్వహించి శ్రీశైలం క్షేత్రానికి తరలివెళ్లారు. జోగిపేటలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శివదీక్ష చేపట్టిన సుమారు 30మంది శివస్వాములకు ఆలయంలో పడిపూజ నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులు, భక్తుల ఆశీర్వాదాలు తీసుకొని శ్రీశైలం వెళ్లారు. అంతకుముందు గురుస్వాముల ఆధ్వర్యంలో శివదీక్ష చేపట్టిన స్వాములకు ఇరుముడి ధరింపచేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

## పేద వధువుకు పుస్తెలు, మెట్టెలు అందజేత

**మర్కుక్, ఫిబ్రవరి 29 (ప్రభాతవార్త):** మండలకేంద్రానికి చెందిన అన్నల్ దాస్ సురేష్, మమతల కూతురు పూజ వివాహానికి మండల బిఆర్ఎస్ పార్టీ బిసిసెల్ అధ్యక్షుడు మ్యాకల కనకయ్య ముదిరాజ్ గురువారం పుస్తె మట్టెలను అందజేశారు. ఈ సందర్భంగా మ్యాకల కనకయ్య మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అని, తన సంపాదనలో కొంత నిరుపేదలకు సహాయం చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. నిరుపేద కుటుంబాలకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ మాజీ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మల్లేష్ ముదిరాజ్, సతీష్‌గౌడ్, ప్రవీణ్, భాస్కర్, క్రాంతి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగికి పదవీ విరమణ సహజం : డిఎం




కిష్టయ్య దంపతులను సన్మానిస్తున్న ఆర్టీసీ డిఎం సురేఖ

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 29 (ప్రభాతవార్త):** ఉద్యోగికి పదవీ విరమణ సహజమని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోలో ఏడిసిగా గత 36 సంవత్సరాలుగా సేవలందిస్తున్న కిష్టయ్య పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ సురేఖ ఆధ్వర్యంలో గురువారం కిష్టయ్య లత దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం డిఎం సురేఖ మాట్లాడుతూ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపోలో ఏడిసిగా కిష్టయ్య అందించిన సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ బాబునాయక్, ఉద్యోగులు ఆర్‌పి.రెడ్డి, విబిఓ జయేందర్‌రెడ్డి, కనకయ్య, కేఎం.రెడ్డి, అంబదాస్, సంజీవ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియోపై అవగాహన

**గజ్వేల్, ఫిబ్రవరి 29 (ప్రభాతవార్త):** పట్టణంలోని సమీకృత కార్యాలయ భవనంలో గురువారం పల్స్ పోలియోపై ఆశ వర్కర్స్, అంగన్‌వాడీ టీచర్స్, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాహుల్ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన శిశువు నుండి 5 సంవత్సరాలలోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయాలని సూచించారు. నిండు జీవితానికి రెండు చుక్కలు చాలన్నారు. పోలియో మహమ్మారి వల్ల పక్షవాతం, కాళ్ళు, చేతులు, మెడ చచ్చుబడిపోవడం, శాశ్వత అంగవైకల్యం వస్తుందన్నారు. జలుబు, దగ్గు, జ్వరం ఏది ఉన్నా పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. పట్టణాల్లో, గ్రామాల్లో ప్రతి చోటా పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, తల్లిదండ్రులు వారి పిల్లలకు తప్పనిసరిగా చుక్కల మందు వేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ డాక్టర్ సింగ్ కాశీం, అంగన్‌వాడీ సూపర్వైజర్ శ్రీలత, రూట్ సూపర్వైజర్ దేవసాని వాసుదేవ్, నాగరాజు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఎన్‌సిసి కార్యకర్తలు పాల్గొన్నారు.



పల్స్ పోలియోపై అవగాహన కల్పిస్తున్న పిహెచ్‌సి వైద్యాధికారి రాహుల్